మొదటిపేజీ తరువాయి

## పశ్చిమాసియాలో
# మళ్లీ యుద్ధ మేఘాలు

మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

మొదటిపేజీ తరువాయి

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

### నీళ్లు లేక 49మంది మృత్యువాత

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత  ఆరోపణలు

### ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

### భూదందాలో  సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు

రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు.  ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# అన్నామలైకి భారీ ఫాలోయింగ్

శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు. వియ్ ది పీపుల్‌ను ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు. తన ఉద్యమానికి వాలంటీర్లే జీవనాడి అని అన్నారు. కొత్త తరం నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, క్షేత్రస్థాయిలో అసలైన మార్పు కోసం వాలంటీర్లు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని వాలంటీర్లు ఎంచుకుని చేతనైన మేరకు తాముంటున్న చోట మేలి మార్పులు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజులు మరింత మెరుగ్గా ఉండేలా తాను చేస్తున్న ప్రయత్నాలను చేయూతను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మొదటిపేజీ తరువాయి

# మద్యనిషేధ హామీని

# గాలి కొదిలేసిన జగన్

ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశినిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్దాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

# వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం.. .బ్లూకలర్ జాబ్స్

మొదటిపేజీ తరువాయి

### పరిస్తితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి

### జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు

### డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్టస్ ఏర్పాటు-సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు.జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ధాన్యం కొనకుంటే మోడీ సంగతి
# తేలుస్తాం

పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు.  కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని  అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

మొదటిపేజీ తరువాయి

# సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

### మలేషియా ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడు తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ- మలేషియా మధ్య సాంకేతిక, పెట్టుబడి సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. మలేషియా ప్రతినిధి వైబీ జగదీప్ సింగ్ దియో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.



# కలిసికట్టుగా కృషి చేస్తేనే వార్డుల అభివృద్ధి సాధ్యం






**-8,9,10,11,19 వ వార్డులలో ప్రజా అవగాహన-స్వచ్ఛత సమావేశం విజయవంతం**

**-బహిరంగంగా చెత్త వేస్తే భారీ జరిమానా...**

**-గంజాయి మత్తు పదార్థాలపై యువత,తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి...**

**-స్వచ్ఛ చౌటుప్పల్ గా తీర్చిదిద్దుదాం...**

**-మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్**

**చౌటుప్పల్,జూన్ 06,** అన్ని వార్డులలో మొక్కలు నాటి స్వచ్ఛచౌటుప్పల్ గా తీర్చిదిద్దామని మున్సిపల్చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు."పరిశుభ్రమైన వార్డు -- ఆరోగ్యవంతమైన ప్రజలు" అనే నినాదంతో 8,9,1011,19 వ వార్డులలో శనివారం వివిధ వార్డుల కౌన్సిలర్ల అధ్యక్షతన నిర్వహించిన ప్రజా అవగాహన - స్వచ్ఛత సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, సిఐ మన్మధ కుమార్ లు పాల్గొని "మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలన్నారు. ప్రజల ఆరోగ్యమే తమ ప్రాధాన్యతని తెలిపారు. వార్డులలో ప్రతి రోజు దోమల నివారణ మందు పిచికారీ, ఒక రోజు విడిచి ఒక రోజు డ్రైనేజీల పరిశుభ్రత పనులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళాభివృద్ధి సాధికారిక కేంద్రాలు నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ వారి అన్యోన్య దాంపత్యానికి బాటలు వేస్తుందని తెలిపారు.అనంతరం వారి చేతుల మీదుగా మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు కంకణ బద్ధుడు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఎనిమిదో వార్డులో లక్కారం చెరువు కట్ట సమస్య, బ్రహ్మంగారి గుడి నుండి హైస్కూల్ వరకు తారు రోడ్డు నిర్మాణం,వికలాంగుల కాలనీలో డ్రైనేజీ సమస్యలను మాజీ కౌన్సిలర్ కొయ్యాడ సైదులు మున్సిపల్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. 8వ వార్డులో నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను మున్సిపల్ చైర్ పర్సన్ చేతుల మీదుగా ప్రారంభించారు. 9వ వార్డులో జంగాల కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధిక ప్రాధాన్యత చైర్పర్సన్ హామీ ఇచ్చారు. పదో వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కౌన్సిలర్ దేపరాజు రమ్య రాజు చైర్పర్సన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వార్డులో ఉన్న ప్రధాన సమస్యలన్నిటిని రాబోయే మూడు నెలల కాలంలోనే అధికారుల సమన్వయంతో పూర్తిగా పరిష్కరిస్తామని సభ ముఖంగా హామీ ఇచ్చారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల వార్డు ప్రజలు, తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఐ మన్మధ కుమార్ తెలిపారు.

**లికోతులు వీధికుక్కల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం...**

వివిధ వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న కోతులు వీధి కుక్కల సమస్యపై చైర్ పర్సన్ స్పందిస్తూ వీధి కుక్కల నివారణకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తోపాటు, వాటి సంతానోత్పత్తి నివారణ చర్యలను కూడా చేపడతామని తెలియజేశారు. అలాగే కోతుల నివారణకు ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేశామని, కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తాను మున్సిపల్ కార్యాలయంలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

**బహిరంగంగా చెత్త వేస్తే 5000 జరిమానా, కేసులు తప్పవు..**

పట్టణ పరిశుభ్రత పై మున్సిపల్ యంత్రాంగం కఠిన నిర్ణయం తీసుకుందని చైర్ పర్సన్ తెలిపారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై, మురికి కాలవలో, బహిరంగ ప్రదేశాలలో పడవేయకూడదని సూచించారు. చెత్త ఆటోలకు మాత్రమే అందించాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బహిరంగంగా చెత్త వేసే వారికి 500 నుండి 5వేల వరకు భారీ జరిమానా విధించడంతోపాటు, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, సీఐ మన్మధ కుమార్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు కాసాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, వార్డు కౌన్సిలర్స్ బద్రి గాలయ్య,దేప రమ్య రాజు, పిల్లలమర్రి మధుసూదన్,షీ టీం అధికారులు,చౌటుప్పల్ మున్సిపల్ అధికారులు,వార్డు అధ్యక్షులు పోలోజు శీనివాస్ చారి ఇందిరామ్మ కామిటి మేబర్ చింతల మహీధర్, చిటు మహేష్, పబ్బు శ్రీకాంత్, కో ఆప్షన్ నెంబర్ సందగాళ్ల విజయ సతీష్,వార్డు ప్రజలు, మహిళలు, యువత, స్థానిక నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సింగరేణిలో భారీ కుంభకోణం..

## - రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపణసిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు డిమాండ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసి విచారణ కోరిన కేటీఆర్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ)లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు.సింగరేణిలోని పలు స్టాక్యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు.ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# బీరంగూడ డివిజన్లో అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

## జోనల్ కమిషనర్కు వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ నేత శశిధర్ రెడ్డి

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీరంగూడ డివిజన్-270లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటం, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని శశిధర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, మల్లేష్, కృష్ణ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం

మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన కానూరి వెంకన్న (టైలర్ ) అనారోగ్యంతో భాధపడుతూ ఇటీవల మరణించగా శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం దశదిన కర్మలకు రాజుపేట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల చొరవతో రూ,13,500 రూపాయల నగదును మృతుడి తల్లి వైదేవమ్మకు ఆర్థిక సాయంగా అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమం లో జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి తుమ్మూరి రాంరెడ్డి,మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పొట్రూ సమ్మయ్య,మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు పళ్ళికొండ యాదగిరి,బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు వీర్ల జయకృష్ణ,బాధ విరారెడ్డి, చదలువాడ సత్యనారాయణ పాల్గొన్నారు.



# భూపాల్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**-60వ వివాహ వార్షికోత్సవ వేడుకల్లో కేసీఆర్ దంపతులతో భేటీ**

-వెన్నవరం కుటుంబానికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తాం

-కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన భూపాల్ రెడ్డి

-బీఆర్ఎస్ నేతల సమక్షంలో జరిగిన ప్రత్యేక సమావేశం

-దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్ష

-పార్టీకి కుటుంబం చేసిన సేవలను గుర్తు చేసిన కేసీఆర్

**పటాన్చెరు,** తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి తన సతీమణి గీతా భూపాల్ రెడ్డితో కలిసి తమ 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ కేసీఆర్ దంపతులను కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు భూపాల్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వెన్నవరం కుటుంబం పార్టీకి



అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తులో కుటుంబ సభ్యులకు తగిన రాజకీయ ప్రాధాన్యం, ఉన్నత స్థానం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ భేటీలో రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, భూపాల్ రెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ ఆసుపత్రిలో వట్టే జానయ్య యాదవ్ను పరామర్శించిన రమేష్ యాదవ్

-జానయ్య యాదవ్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

-త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన రమేష్ యాదవ్

-గాంధీ ఆసుపత్రిలో బీసీ ఉద్యమ నాయకుడి పరామర్శ

గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ ఉద్యమ నాయకుడు వట్టే జానయ్య యాదవ్ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. జానయ్య యాదవ్కు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే జానయ్య యాదవ్ ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరోగ్య మిత్రల నియామక పరీక్ష నిర్వహించిన డీఎంహెచ్ఓ

**ఆర్‌సి.పురం పీహెచ్‌సీ తనిఖీ.. నాణ్యమైన సేవలపై ఆదేశాలు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. లలితా దేవి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆరోగ్య మిత్రల నియామకానికి సంబంధించిన పరీక్షను నిర్వహించారు. అనంతరం ఆమె ఆర్‌సి.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి లేబర్ రూమ్, ప్రయోగశాల, వ్యాక్సినేషన్ రూమ్‌ల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సేవల నిర్వహణ సంతృప్తికరంగా ఉండటంతో మెడికల్ ఆఫీసర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రిని నిర్దేశిత సమయాలకు అనుగుణంగా తెరిచి ఉంచాలని, విధులకు ఆలస్యంగా హాజరయ్యే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా కృషి చేయాలని సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచించారు.



## 75 ఏళ్ల వృద్ధుడికి రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

-మళ్లీ స్వతంత్రంగా నడిచేలా చేసిన మెడికవర్ వైద్యులు
-అద్భుతమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ వైద్య బృందానికి అభినందనలు
-75 ఏళ్ల వయసులో మళ్లీ నడిచేలా చేయడం నిజంగా గొప్ప విజయం
-వయసు కాదు, సరైన వైద్యం ఉంటే జీవితంలో కొత్త ఆశలు చిగురిస్తాయి
-ఆధునిక వైద్యం అద్భుతాలు సృష్టిస్తోందనడానికి ఇదే నిదర్శనం
-వాకర్‌ను మరో రోగికి దానం చేయడం ఎంతో గొప్ప మనసుకు నిదర్శనం
-రోగికి కొత్త జీవితం ప్రసాదించిన వైద్యులకు సెల్యూట్
-ఇలాంటి విజయవంతమైన చికిత్సలు మరెందరికో ఆశాకిరణంగా నిలుస్తాయి
-ఆరోగ్య సేవల్లో మెడికవర్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది
-కరణం రాఘవేంద్ర రావు ఆత్మవిశ్వాసం అందరికీ స్ఫూర్తిదాయకం
-డా. శశివర్ధన్ మరియు వైద్య బృందానికి హృదయపూర్వక అభినందనలు

వయసు పెరిగిందంటే నడవడం కష్టమే అనే అపోహలను చెరిపేస్తూ, 75 ఏళ్ల వృద్ధుడికి రెండు మోకాళ్ల మార్పిడి (బైలాటరల్ టోటల్ నీ రీప్లేస్‌మెంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆయనకు మళ్లీ స్వతంత్రంగా నడిచే అవకాశం కల్పించినట్లు మెడికవర్ హాస్పిటల్స్, చందానగర్ వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర గత కొన్నేళ్లుగా రెండు మోకాళ్లలో తీవ్రమైన ఆస్టియోఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. దీంతో నడవడం, మెట్లు ఎక్కడం, కుర్చీ నుంచి లేవడం వంటి సాధారణ పనులు కూడా కష్టంగా మారాయి. వయసుతో పాటు థైరాయిడ్ సమస్య, గతంలో స్ట్రోక్ రావడం వంటి ఆరోగ్య సమస్యల కారణంగా శస్త్రచికిత్స చేయించుకోవడంపై ఆయన సందిగ్ధత వ్యక్తం చేశారు. అయితే సమగ్ర వైద్య పరీక్షల అనంతరం ఆర్థోపెడిక్ సర్జన్ డా. శశివర్ధన్ నేతృత్వంలోని వైద్య బృందం రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. శస్త్రచికిత్స అనంతరం మొదటి రోజే రోగిని నిలబెట్టి పూర్తి బరువుతో నడిపించారు. ప్రత్యేక ఫిజియోథెరపీ, పునరావాస చికిత్సలతో ఆయన కోలుకునే ప్రక్రియ వేగంగా సాగి, నెల రోజుల్లోనే ఎలాంటి సహాయక పరికరం లేకుండా స్వయంగా నడిచే స్థితికి చేరుకున్నారు. కోలుకునే సమయంలో ఉపయోగించిన వాకర్‌ను మరో రోగికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఆసుపత్రికి విరాళంగా అందించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా డా. శశివర్ధన్ మాట్లాడుతూ, ఆధునిక జాయింట్ రీప్లేస్‌మెంట్ సాంకేతికత, మెరుగైన నొప్పి నియంత్రణ విధానాలు,






వ్యక్తిగత పునరావాస చికిత్సల వల్ల వృద్ధాప్యంలో కూడా అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. తీవ్రమైన మోకాళ్ల నొప్పిని వయసు సహజ లక్షణంగా భావించకుండా నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ మల్లేశ్ పాల్గొన్నారు. రాఘవేంద్ర కోలుకున్న తీరు, సరైన వైద్యంతో వృద్ధాప్యంలోనూ నొప్పిలేని జీవితం సాధ్యమని మరోసారి నిరూపించిందని వైద్యులు పేర్కొన్నారు.

## భగత్‌సింగ్‌నగర్‌లో వార్డు సభ విజయవంతం

**ప్రజా సమస్యల స్వీకరణ, సంక్షేమ పథకాల దరఖాస్తుల నమోదు**

రామకృష్ణాపూర్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ 22వ వార్డులో స్నేహ గణేష్ మండపం వద్ద నిర్వహించిన వార్డు సభ విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో వార్డు వైస్ చైర్‌పర్సన్ మిట్టపెల్లి సరిత,1వ వార్డు కౌన్సిలర్ కొడగాని సాంబయ్య,15వ వార్డు కౌన్సిలర్ అర్నె సంధ్య,19వ వార్డు కౌన్సిలర్ రంగలక్ష్మి,ఏఎస్ఐ సతయ్య,సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్,రెవెన్యూ అధికారి సతీష్, మున్సిపల్ సిబ్బంది,సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్,బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జ్ కరుణాకర్,స్వప్న, సీపీఐ నాయకులు మిట్టపెల్లి పౌలు,లింగయ్య,మహిళా నాయకులు శ్రీజ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.అలాగే వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు.

**కోఆప్షన్ నామినేషన్ :**

ఈ సందర్భంగా సీపీఐ పార్టీ తరపున మైనారిటీ కోటాలో కో–ఆప్షన్ సభ్యుని పదవికి మిట్టపెల్లి పౌలు నామినేషన్ దాఖలు చేశారు.






## మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై గ్రామ సభల్లో అవగాహన

**గొల్లపల్లి గ్రామ సభలో పాల్గొన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసులు, భరోసా కేంద్రం సేవలు, షీ–టీమ్స్ పనితీరు, సైబర్ నేరాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. షీ–టీమ్స్ పాఠశాలలు, కళాశాలలు, బస్ స్టాండ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ మహిళల భద్రతకు కృషి చేస్తున్నాయని తెలిపారు. అలాగే పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు మెడికో–లీగల్ సేవలు, కౌన్సెలింగ్, సహాయ సహకారాలు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా జిల్లా షీ–టీమ్ నంబర్ 8712656772, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 లేదా డయల్–100కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సైబర్ నేరాలపై మాట్లాడుతూ, అధిక లాభాల పేరుతో మోసగాళ్లు ప్రజలను వలలో వేసుకుంటున్నారని హెచ్చరించారు. అపరిచితుల పంపే లింకులు, ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయవద్దని, ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్సిల్, కొరియర్ పేరుతో కూడా మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. నేరాల విచారణకే కాకుండా నేరాల నివారణలో కూడా సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మునిపల్లి మండలంలో నిర్వహించిన గ్రామ సభలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పాల్గొని మహిళల రక్షణకు ప్రభుత్వం, పోలీసు శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. గ్రామస్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, మహిళలు, గ్రామస్థులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.








## కోహెడలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**రైతుల ముందస్తు అరెస్టులకు నిరసనగా బిఆర్ఎస్ నాయకుల ఆందోళన**

కోహెడ గ్రామంలో రైతుల ముందస్తు అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, భూ బాధితులకు న్యాయం చేయకుండా మార్కెట్ ప్రారంభోత్సవం నిర్వహించడం సరికాదని వారు విమర్శించారు. ముందుగా రైతుల అభ్యంతరాలు, సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, అనంతరం మార్కెట్‌ను ప్రారంభించాలని నినాదాలు చేశారు.ప్రభుత్వం రైతుల ఆవేదనను గుర్తించి, భూ బాధితులకు తగిన పరిహారం, న్యాయం అందించాలని టీఆర్ఎస్ నాయకులు కోరారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

# ప్రజపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మానకొండూరులో ఘనంగా "చిల్డ్రన్ పార్లమెంట్ - బాల పంచాయత్" అవగాహన సదస్సు

● గ్రామాభివృద్ధిలో పిల్లలను భాగస్వాములను చేయడమే లక్ష్యం ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ

పాఠశాలలు, కళాశాలల్లో 'స్నేహిత' సీక్రెట్ బాక్సులు విద్యార్థినుల రక్షణకు పెద్దపీట సీపీ గౌష్ ఆలం





**కరీంనగర్ టౌన్, జూన్06(ది క్రైమ్ న్యూస్):** ప్రజపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో బాలల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు, వారి సమస్యలపై చర్చించే వేదికగా 'బాల పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మానకొండూరు మండలంలో మహిళలు, బాలలకు "చిల్డ్రన్ పార్లమెంట్ – బాల పంచాయత్" అనే ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం విడివిడిగా మాట్లాడుతూ బాలల వికాసం, మహిళల రక్షణపై దిశా నిర్దేశం చేశారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాలి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ సందర్భంగా మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ "బాలల హక్కుల పరిరక్షణకు, వారిలో నాయకత్వ వికాసానికి 'బాల పంచాయత్' ఒక అద్భుతమైన వేదిక. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు తమ గ్రామం, పాఠశాల, కుటుంబం సమాజానికి సంబంధించిన సమస్యలను స్వయంగా గుర్తించి, చర్చించి పరిష్కారాలను వెతకడం అభినందనీయం. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందిస్తుంది. ఆరోగ్యం, విద్య, బాలల రక్షణ వంటి కీలక అంశాలపై పిల్లలు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలి. మహిళల భద్రతకు షీ టీమ్స్ భరోసా; 'స్నేహిత'తో బాలికల రక్షణ సీపీ గౌష్ ఆలం, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ "సమాజంలో మహిళలు, బాలల రక్షణకు కరీంనగర్ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లాలో బాలికలను రక్షించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో భాగంగానే కరీంనగర్‌లో 'స్నేహిత' అనే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా 'సీక్రెట్ బాక్స్' లను ఏర్పాటు చేయాలని ఆదేశించాం. విద్యార్థినులు తమకు ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా, వేధింపులనైనా ఈ సీక్రెట్ బాక్సుల ద్వారా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. ఈ బాక్సులకు తాళాలు వేసి ఉంచుతామని, వాటి తాళంచెవులు పూర్తిగా మహిళా కానిస్టేబుళ్ల ఆధీనంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. దీనివల్ల బాలికలకు పూర్తి రక్షణ లభిస్తుంది. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులు ఎదురైనా అధైర్యపడకుండా తక్షణమే షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి. బాధితులు నేరుగా కాకుండా మొబైల్ నంబర్ 8712670759 ద్వారా కూడా వాట్సాప్ లేదా కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను సంపూర్ణంగా గోప్యంగా ఉంచుతాం. మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ చారు సిన్హా, పిలుపు మేరకు బాలలను చైతన్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఈ బాల పంచాయత్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పర్వీన్, ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్లు శ్రీలత, పుల్లయ్య, రమేష్‌లతో పాటు షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగానికి చెందిన సభ్యులు, స్థానిక మహిళలు, బాలలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

● ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్



**కరీంనగర్ టౌన్, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):** మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 'గో టు విలేజ్ – మాదిగ పల్లెలకు తరలండి' కార్యక్రమాన్ని మరియు 40 రోజుల కార్యాచరణను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా వారిని చైతన్యం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా విద్యా, సంస్థగత నిర్మాణం, జెండా ఆవిష్కరణల కోసం ప్రతి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల నాయకులు మాదిగ పల్లెల్లోకి వెళ్లి అక్కడి యువతను చైతన్యపరచాలని కోరారు. 'గో టు విలేజ్' కార్యక్రమం ఈనెల 25 నుండి జూలై 05 వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలి. ఏ గ్రామాల్లో అయితే ఎమ్మార్పీఎస్ గద్దెలు లేవో, అక్కడ నూతనంగా గద్దెలను నిర్మించి మాదిగలకు పండుగ దినోత్సవమైన జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణలు చేసి, ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిర్సపల్లె గ్రామ కమిటీ ఎమ్మార్పీఎస్ నాయకులు తునికి భాస్కర్ మాదిగ, కడారి శంకర్ మాదిగ, తునికి సంజీవ్ మాదిగ, తునికి సుధాకర్ మాదిగ, భాస్కర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద నూతన ట్రాఫిక్ ఔట్ పోస్ట్ బూత్ ప్రారంభం

● ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ గ్లాసెస్ పంపిణీ చేసిన సీపీ గౌష్ ఆలం





**కరీంనగర్ టౌన్, జూన్06(ది క్రైమ్ న్యూస్):** నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా కరీంనగర్ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద శనివారం నాడు నూతన ట్రాఫిక్ ఔట్ పోస్ట్ బూత్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అత్యంత రద్దీగా ఉండే బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను అదుపు చేయడానికి, నిరంతరం పర్యవేక్షించడానికి ఈ నూతన ఔట్ పోస్ట్ బూత్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్‌గా ఉండాలని సూచించారు. సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ – కూలింగ్ గ్లాసెస్ పంపిణీ: కార్యక్రమంలో భాగంగా, భానుడి భగభగలకు సైతం వెరవకుండా రోడ్లపై నిలబడి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ప్రత్యేక కూలింగ్ గ్లాసెస్ సీపీ అందజేశారు. తీవ్రమైన ఎండల నుండి సిబ్బంది తమ కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. విధి నిర్వహణతో పాటు సిబ్బంది ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామితో పాటు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్-ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్క చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు



**మధిర ప్రతినిధి, జూన్ 6 (ది క్రైమ్ న్యూస్):** ఇల్లందులపాడు నుంచి మహాదేవపురం వరకు రైతుల కోసం బిటి రోడ్డు వేస్తానన్న మాట నిలుపుకొని ఈ ప్రాంత రైతాంగానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దేవుడయ్యాడని మధిర మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర గ్రామీణ ప్రాంతాలను, మండల కేంద్రాలను అనుసంధానిస్తూ నాణ్యమైన బీటీ రోడ్ల నిర్మాణానికి మరియు రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసిన సందర్భంగా, మధిర మున్సిపాలిటీలో ఇల్లెందులపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషిస్తున్నారు అని అన్నారు. ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మరియు రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలను అమలు చేయడంలో భట్టి విక్రమార్కకు తిరుగేలేదని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇల్లెందులపాడు నుంచి మహాదేవపురం వరకు సరైన రోడ్డు మార్గం లేక రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్నికల సమయంలో రైతులు బీటీ రోడ్డు కావాలని భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఆనాడు రైతులు ఆవేదనను విన్న భట్టి విక్రమార్క నేడు 30 కోట్ల రూపాయలతో నాణ్యమైన బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ఈ ప్రాంత రైతాంగానికి దేవుడయ్యాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చావా వేణు, మాజీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మిరియాల వెంకటరమణ గుప్తా, పులిబండ్ల చిట్టిబాబు, ఇల్లెందులపాడు, మహాదేవపురం గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో అడ్మిషన్లు పొందండి

**- జిల్లా మైనారిటీ విభాగం పిలుపు - జిల్లా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ పక్షాన మహమ్మద్ తాజోద్దీన్**



**కరీంనగర్ టౌన్, జూన్ 6(ది క్రైమ్ న్యూస్ ):** నగరంలోని పేద, మధ్యతరగతి ముస్లిం మైనారిటీ విద్యార్థులు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ హాస్టల్స్‌లో వెంటనే అడ్మిషన్లు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. ఈ పాఠశాలల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ముస్లిం బాయ్స్, గర్ల్స్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కూల్స్ ద్వారా విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తోందని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయికి దీటుగ, పౌష్టికాహారం, హాస్టల్స్ లో ఉండే విద్యార్థులకు ఉదయం రుచికరమైన మధ్యాహ్న భోజనం శుభ్రమైన, బలవర్ధకమైన మధ్యాహ్న భోజన వసతి, సాయంత్రం స్నాక్స్ విద్యార్థుల ఆరోగ్యానికి మేలు చేసే సాయంత్రం అల్పాహారం. నాణ్యమైన మరియు రుచికరమైన క్వాలిటీ డిన్నర్. మైనారిటీ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీ పిల్లలతో పాటు మీ బంధువులు, స్నేహితుల పిల్లలను కూడా ఈ స్కూల్స్ లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ పక్షాన మహమ్మద్ తాజోద్దీన్ వేడుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు ఎల్కపెల్లి పౌల్



**కరీంనగర్ టౌన్, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఆరెపల్లి మోహన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కపెల్లి పౌల్ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎల్కపెల్లి పౌల్ మాట్లాడుతూ ఆరెపల్లి మోహన్ భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఆయన మరిన్ని సేవలందించేలా ఆ దేవుడు నిరంతర ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు.

## కవ్వంపల్లి మహా కుటుంబం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి పరామర్శ, ఆర్థిక సహాయం



**కరీంనగర్ టౌన్, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):** దేశాయ్యపల్లి గ్రామం, వీణవంక మండలానికి చెందిన కవ్వంపల్లి రాజయ్య ఇటీవల మరణించిన నేపథ్యంలో, వారి కుటుంబ సభ్యులను ఈ రోజు కవ్వంపల్లి మహా కుటుంబం ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాజయ్య కుటుంబ సభ్యులైన మాజీ ఎంపీటీసీ సభ్యులు కవ్వంపల్లి సంపత్, శ్రీనివాస్, రత్తయ్యలను కలిసి ప్రతినిధులు తమ గాఢ సంతాపం తెలియజేసి, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం కవ్వంపల్లి మహా కుటుంబం తరపున బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం బ్యాగ్‌తో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కవ్వంపల్లి మహా కుటుంబం కో-ఆర్డినేటర్ కవ్వంపల్లి భూమేష్ పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మహా కుటుంబ సభ్యులు కవ్వంపల్లి రాజు కుమార్, శ్రీనివాస్, చంద్రయ్య, కానుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన మహిళా కానిస్టేబుల్ శ్రీలత



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతను రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ యోగా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన పెద్దపల్లి జోన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతను పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఘనంగా సత్కరించారు. హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో మే 23, 2026న నిర్వహించిన 3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన యోగా పోటీల్లో శ్రీలత ప్రతిభ చూపి బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, కమాన్‌పూర్ ఎసఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడేలా కృషి చేయాలి

● రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ● కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడేలా కృషి చేయాలి అని రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శనివారం కమిషనరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారియోం పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక దాడులు తదితర కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయస్థానంలో సమర్థవంతంగా కేసులను వాదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారంట్లను, సమన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, వైద్య ఆధారాలను సమగ్రంగా సేకరించి కోర్టుకు సమర్పించాలని తెలిపారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎసై వినీత, కోర్టు డ్యూటీ సిబ్బంది పాల్గొన్నారు.





# వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం

● మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ ● పారుపల్లి పెద్ద చెరువు వద్ద బర్డ్ వాక్, వన్యప్రాణుల అవగాహన కార్యక్రమం నిర్వహణ

● జీవ వైవిధ్య పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యం ● గ్రామస్తులు, యువతకు బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్ ద్వారా పర్యావరణ అవగాహన

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ అన్నారు. శనివారం ముత్తారం (మంథని) మండలంలోని పారుపల్లి గ్రామ పరిధిలో మైదంబండ బీట్, బేగంపేట సెక్షన్‌లో ఉన్న పారుపల్లి పెద్ద చెరువు వద్ద "బర్డ్ వాక్స్ అండ్ వైల్డ్ లైఫ్ అవేర్‌నెస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువతకు అడవుల్లో నివసించే వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో పక్షులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అడవులు, చెరువులు, సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో భాగంగా బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి సంపద పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



డిప్యూటీ రేంజ్ అధికారి జె. తిరుపతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.కే. నహీదా పర్వీన్ (బేగంపేట), ఎస్.డి. రహమతుల్లా, ఎం. అమీర?ద్దీన్, ఫారెస్ట్ బీట్ అధికారులు ఎస్. మేఘరాజ్, టి. రామ్‌సింగ్, ఎ. మాధురి, పి. రంజిత, బయాలజిస్ట్ చంద్రకాంత్, పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్, పోతారం, పారుపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువతతో పాటు మొత్తం 48 మంది పాల్గొన్నారు.

# ధర్మపురిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

● గోదావరిలో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు ● రాష్ట్ర సాంఘీక క సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, జూన్ 6, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించి ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. శనివారం ధర్మపురి పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన మంత్రి అడ్లూరి గోదావరి పుష్కర ఘాట్లతో పాటు పట్టణంలోని పలు వార్డులను సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ వచ్చే గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని మంత్రి అన్నారు. ధర్మపురి పట్టణంలో ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ధర్మపురి డ్రైనేజీ నీరు గోదావరిలో కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్థానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల హక్కులను కాలరాసే చర్యలను సహించబోం

● భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం ● రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం అత్యంత దురదృష్టకరం ● బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్

**రామగిరి, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలంలో సింగరేణి యాజమాన్యం భూనిర్వాసితుల పట్ల అనుసరిస్తున్న వైఖరి నిజాం పాలనను తలపించే విధంగా ఉందని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. భూనిర్వాసితులు తమ వ్యక్తిగత అవసరాల కోసం, ముఖ్యంగా కూతురు వివాహం, కుటుంబ అత్యవసర ఖర్చులు, తల్లిదండ్రుల ఆరోగ్య చికిత్సల కోసం తమ ప్లాట్లు లేదా ఆస్తులను విక్రయించు కోవాలనుకుంటే, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలున్నాయని చెప్పి రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకోవడం అధికారుల నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజల ఆస్తులపై హక్కులను కాలరాస్తూ, భూనిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. సింగరేణి ఏరియా అధికారులు ఆడుతున్న ఈ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు అని శ్రీనివాస్ పేర్కొన్నారు.ఒక సర్వే నంబర్‌లో 50 ఎకరాల భూమి ఉండి, సింగరేణికి కేవలం 20 ఎకరాలు మాత్రమే అవసరమైనప్పటికీ, మొత్తం సర్వే నంబర్‌లో ఉన్న భూములన్నింటిపై రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం అన్యాయమని ఆయన అన్నారు. అవసరమైన భూమిని మాత్రమే స్వాధీనం చేసుకోవాల్సిన చోట, సంబంధం లేని భూముల యజమానుల హక్కులను కూడా హరించడం సమంజసం కాదన్నారు.అంతేకాకుండా, రామగిరి మండలంలోని సింగరేణి ప్రభావిత గ్రామాల్లో 10 నుండి 15 సంవత్సరాల క్రితం భూనిర్వాసితులకు పునరావాసంలో భాగంగా కేటాయించిన భూములు, ప్లాట్లు మరియు ఆస్తుల రిజిస్ట్రేషన్లను కూడా ప్రస్తుతం అడ్డుకోవడం మరింత అన్యాయమని ఆయన పేర్కొన్నారు. గతంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో కేటాయించిన ఆస్తులపై నేడు ఆంక్షలు విధించడం వల్ల భూనిర్వాసిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. భూనిర్వాసితుల సమస్యలను



వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఈ అంశాన్ని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, భూనిర్వాసితుల హక్కుల పరిరక్షణ కోసం న్యాయపరంగా హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ప్రజల హక్కులను కాలరాసే చర్యలను సహించబోమని, భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని మొలుమూరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సెంటినరీ కాలని పట్టణ అద్యక్షుడు తీగల శ్రీధర్, బిజెపి సీనియర్ నాయకులు మేరుగు శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే భారీ జరిమానా

- నగర మేయర్ మహంకాళి స్వామి - డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినవారికి జరిమానా విధించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశించారు. వార్డు సందర్శనలో భాగంగా శనివారం 56 వ డివిజన్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల్లో పూడిక తీస్తున్న క్రమంలో ఎక్కువగా ఇంట్లో నుండి వెలువడుతున్న చెత్త కనిపిస్తుందని అన్నారు. పరుపులు, టైర్లు ఇతర వస్తువులు పడవేస్తుండడంతో అడ్డుపడి నీరు సాఫీగా ప్రవహించకుండా నిలిచిపోతున్నదని అన్నారు. తద్వారా ఇళ్లలోకి వరద నీరు వస్తున్నదని అన్నారు. వరద ముప్పు నివారించడానికి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి డ్రెయిన్లు నిర్మిస్తున్నా ఇంట్లో నుండి వెలువడుతున్న చెత్త అడ్డుపడి ప్రయోజనం లేకుండా పోతున్నదని అన్నారు. మెప్మా ఆర్ పి లు, స్వశక్తి మహిళలు చెత్త బయట పడవేయకుండా ఇంటింటా అవగాహన కల్పించాలని అన్నారు. కాగా ఈ సందర్భంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి తిలక్ నగర్ లో ప్రవహిస్తున్న మేజర్ నాలాలో పూడిక తొలగించారు.

# మద్యం త్రాగి వాహనం నడిపితే చర్యలు తప్పవు..

మద్యం తాగి పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష విధించిన జడ్జి




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మద్యం తాగి ఆ మత్తులో వాహనాన్ని రోడ్డుపై అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ పోయే మందుబాబులు ట్రాఫిక్ పోలీసులకు చిక్కితే జైలుకెళ్లడం ఖాయమే. మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ రోడ్లపై తిరిగి ప్రమాదాలకు కారకులు కావొద్దనే ఆలోచనతో చట్టపరంగా కఠిన శిక్షలను విధిస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 19 మందిని శనివారం స్థానిక కోర్టులో హాజరుపర్చాగా విచారణ జరిపిన జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్. మంజుల అదిలాబాద్ జిల్లా రాసులపల్లికి చెందిన బుద్దుల మధుకర్: పెద్ద శంకర్( 27 సంవత్సరాలు) కు 04 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ట్రాఫిక్ సీఐ బి. శ్రీనివాస్ తెలిపారు. మిగతా 18 మందికి రూ.19500/- లు జరిమానా విధించినట్లు తీర్పులో పేర్కొన్నారని పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ బి శ్రీనివాస్ వివరించారు.

# కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య: చికిత్స పొందుతూ మృతి

**కరీంనగర్ టౌన్, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):** కడుపు నొప్పి బాధను భరించలేక ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చెంజర్ల గ్రామానికి చెందిన కౌలు రైతు వల్లెపు స్వప్న (36) అనే మహిళతో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 16 సంవత్సరాల కుమారుడు స్వాతిక్ ఉన్నాడు. గత ఆరు నెలలుగా స్వప్న తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యులతో పాటు, చెట్ల మందులు పసర్లు వాడుతున్నప్పటికీ ఆమెకు నయం కాలేదు.ఈ క్రమంలో నిన్న ఉదయం 6:30 గంటల ప్రాంతంలో కడుపు నొప్పి మరింత విపరీతం కావడంతో, జీవితంపై విరక్తి చెందిన స్వప్న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. గమనించిన కుమారుడు కేకలు వేస్తూ పొలంలో ఉన్న తండ్రికి సమాచారం అందించాడు. వెంటనే భర్త, బంధువులు కలిసి ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ఆమె పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం 6:50 గంటల ప్రాంతంలో స్వప్న మృతి చెందింది. కడుపు నొప్పి బాధ భరించలేకనే తన భార్య ఆత్మహత్య చేసుకుందని, ఆమె మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని భర్త తెలిపారు.

# జూన్ 10న ఇల్లందులో ఐ ఎఫ్ టి యు జిల్లా రాజకీయ తరగతులు




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** జూన్ 10న ఇల్లెందులో జరుగు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు)జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు, జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల పరిధిలోని ముకుందాపురం ఏరియాలో గ్రామ పంచాయతీ, హమాలీ కార్మికుల వద్ద కరపత్రలద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి, జిల్లా నాయకులు నరాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ రాజకీయ తరగతులలో జాతీయ కార్మిక పోరాటాలు ఐ ఎఫ్ టి యు జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ కార్మిక పోరాటాలు ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాలుగు లేబర్ కోడ్లను ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.సీతారామయ్య, ఐ ఎఫ్ టి యు కర్తవ్యాలు జిల్లా అధ్యక్షులు కే. సారంగపాణి హాజరై ప్రసంగిస్తారని అన్నారు. కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు రామండ్ల మోహన్ రావు, తొండల సర్వయ్య, ఐలు ఉప్పలయ్య, చిత్తారి వెంకన్న, పూనెం లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు ఉద్యోగ భద్రతా కల్పించాలి

**● కార్మికులపై కాంట్రాక్టర్ల దాడులను అరికట్టాలి ● పని ప్రదేశాలలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి ● హమాలీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు వినతి పత్రం అందజేసిన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలోని సి డబ్ల్యూ సి, ఎస్డబ్ల్యుసి, ఏఎంసి, ప్రభుత్వ ప్రైవేటు గోదాములు, రైల్వే గుడ్ షెడ్, రైస్ మిల్లులు బజార్, వివిధ సంస్థలు స్థలలలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల భద్రతా, భరోసా, కనీస సౌకర్యాలు, తదితర సమస్యలు, కార్మికులపై జరుగుతున్న దాడులు, యజమానుల వివక్షపై తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర బాధ్యులు గుంటి సామ్రాజ్యం సూచన మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నేడి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును మర్యాదపూర్వకంగా కలిసి హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నేడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో వేల సంఖ్యలో హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని, భద్రతా భరోసా లేకుండా యజమానుల శ్రమ దోపిడీకి గురవుతున్నారని హమాలీ కార్మికుల శ్రమకు తగిన ఫలితం అందడం లేదని అన్నారు. బీహార్ అంతర్రాష్ట్ర కార్మికులకు అరకోర వేతనాలు చెల్లిస్తూ పనులు చక్కబెట్టుకుంటూ స్థానిక హమాలి కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆయా గోదాముల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బస్తాకు పీస్ రేట్ నిర్ణయించి సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సహకరించాలని, హమాలీ కార్మికులపై దురుసుగా ప్రవర్తిస్తున్నా ఆయా గోదాముల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ కార్మికులకు అండగా ఉంటుందని పని ప్రదేశాలలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని త్వరలోనే సంఘం భవన నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని కేటాయిస్తామని, మాట ఇచ్చిన విధంగా పెద్దపల్లి రైల్వే గుడ్ షెడ్ హమాలీ కార్మికులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేలా త్వరలోనే మినరల్ వాటర్ ప్లాంట్ ను సైతం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నేడి వెంకట్ రెడ్డి, నాయకులు కామ భూమన్న, చిలువేరు శంకర్, కొమ్ము మధు, కొమ్ము సందీప్, వెంకన్న, రాజు, బండారి రమేష్, యుగంధర్, కొమురయ్య, రమేష్ వివిధ గోదాముల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ మెడికల్ కళాశాలలో అధిక ఫీజులను వసూలను కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

**● పాలడుగు శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకులు**

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ లో ఉన్నటు వంటి మెడికల్ కళాశాలలు ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థుల తలిదండ్రుల దగ్గర నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ కోర్స్ ఫీజు నాలుగున్నరేళ్ల కు మాత్రమే ఫీజులు తీసుకోవాలి కానీ ప్రైవేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యం నిబబంధనకు విరుద్ధంగా ఎంబీబీఎస్ ఐదు సంత్సరాల ఫీజులు అధికంగా అక్రమంగా వసూలు చేస్తున్నారు ఒక్కొక్క ఎంబీబీఎస్ విద్యార్థి దగ్గర అదనంగా ఆరు నెలల ఫీజు 7 నుండి ఎనిమిది లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. అదనం ఫీజు చెల్లించాం అని ఎవరైనా మెడికల్ కాలేజీల్లో యాజమాన్యాలను నిలదీసి అడిగితే ఇంటర్న్ షిప్‌కు అనుమతి ఇవ్వమని మా దగ్గరినే మీ ప్రాక్టికల్ మార్క్స్ ఉంటాయి అని మీరు ఆరు నెలల ఫీజు చెల్లించితేనె ఇంటర్న్ షిప్ కు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. పైగా తెలంగాణ ఫీజు రెగ్యులటరీ బోర్డు ను కూడా చీటింగ్ చేస్తున్న ప్రైవేట్ మెడికల్ కాలేజ్ యాజమాన్యంకి సమర్పించే ఆడిట్ రిపోర్ట్ లో ఆయా ప్రైవేట్ మెడికల్ కళాశాలలు మాత్రం నాలుగున్నర సంవత్సరాలు మాత్రమే ఫీజులు వసూలు చేస్తున్నాం అని ఆడిట్ రిపోర్ట్ కి ఇస్తారు. కానీ విద్యార్థుల దగ్గర ఐదు సంత్సరాల ఫీజు వసూలు చేస్తున్నారు. ఇలా ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యంకి ఫేక్ ఆడిట్ రిపోర్ట్ సమర్పిస్తుంది ఇలా ప్రభుత్వాన్ని చీటింగ్ చేస్తున్న ప్రైవేట్ మెడికల్ కళాశాలల మీద దృష్టి పెట్టి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి గత కొన్ని సంవత్సరాలుగా అదనంగా వసూలు చేస్తున్న ఫీజులను ఎంబీబీఎస్ విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి ఇవ్వాలని లేని పక్షంలో కాలేజ్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. గతంలో మరియు ఇప్పుడు ఎన్నో సార్లు కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ వీసీ కి, గాళ్ఖీ=జ కి, ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెల్లి పిర్యాదు చేసిన ప్రైవేట్ మెడికల్ కాలేజీల మీద ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం సిగ్గు మాలిన చర్యగా భావిస్తున్నాం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వైద్య శాఖ మంత్రి వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించి ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూన్నాం



# సింగంపల్లి బ్రిడ్జికి తట్టెడు మట్టి పోయించని దుద్దిళ్ల శ్రీధర్..

**● రింగ్‌రోడ్డు పూర్తి చేశానని చెప్పుకోవడానికి ఎమ్మెల్యేకు జ్ఞానం ఉండాలే ● మీ తండ్రి సంకల్పమేంటో...ఏం పనులు చేశావో సమాజానికి చెప్పాలే ● ఇసుక మట్టి మాపియాతో జోకర్ తమ్ముడికి దోచి పెడుతున్న దుద్దిళ్ల ● బీఆర్ఎస్ ప్రభుత్వంలో రింగ్‌రోడ్డు పూర్తి చేసి...11బ్రిడ్జిలు కట్టించాం ● ఆడబిడ్డల ఆస్పత్రిని పట్టించుకోవు...అడవి బిడ్డల కష్టాలు చూడవా ● ఎన్ని కుట్రలు చేసినా..కేసులు పెట్టించినా నీ మెడలు వంచి పని చేయిస్తా ● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





**రామగిరి, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):-** మహాముత్తారం మండలం సింగంపల్లి గ్రామంలోనీ బ్రిడ్జి అప్రోచ్ వాల్‌కు తట్టెడు మట్టి పోయించలేని సన్నాసి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రంగా విమర్శించారు. శనివారం మహాముత్తారం మండలం సింగంపల్లి బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు దుద్దిళ్ల శ్రీధర్ మంత్రిగా ఉన్నప్పుడు బ్రిడ్జి మంజూరైతే దానిని కట్టలేకపోయాడని, కాంట్రాక్టర్ మద్యలోనే వెళ్లపోయిందని, శిలా ఫలకం కూడా ఇక్కడే ఉందని గుర్తు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పంకెన వయా మోదేడు సింగంపల్లి రోడ్డుకు రూ. 25కోట్లు పైచిలుకు నిధులు తీసుకువచ్చి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయగా అటు ఇటు అప్పోచ్ వాల్ నిర్మాణ పనులు మిగిలిపోయాయని, ఆ పనులను మూడు ఏండ్లకు దగ్గరకు వచ్చిన ఈ పనులు పూర్తి చేయని పరిపాలన దుద్దిళ్ల శ్రీధర్‌అని ఆయన ఎద్దేవా చేశారు. మంథని పట్టణంలోని ఆడబిడ్డల ఆస్పత్రిని సక్కగా చూడకుండా కనీసం వైద్యులను నియమించలేదని, ఇక్కడ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రవాణా సౌకర్యాలు చూడకుండా వారి స్థతిగతులు పట్టించుకోవడం లేదని, అందుకే దుద్దిళ్ల శ్రీధర్‌కు ఈ ప్రాంత ప్రజలతో ఓటు సంబంధం తప్ప పేగుసంబంధం లేదని పదేపదే చెప్తున్నానని అన్నారు. సమస్యను చూపిస్తే పరిష్కరించడానికి ప్రయత్నం చేయకుండా వాళ్ల మనుషులతో తిట్టించే సమయాన్ని ఇలాంటి పనుల అభివృద్ధి చేయడానికి కేటాయించుమని చెప్తే ఇప్పటి వరకు మంథని ఎమ్మెల్యే కళ్లు తెరువడం లేదన్నారు. ఎన్నికలు వస్తే ఈ విధంగా ప్రజలను, సమస్యలను పట్టించుకోకుండా ఎప్పుడు తండ్రి ఆశయాలంటూ మాట్లాడుతుంటాడని అన్నారు. రింగ్‌రోడ్ పూర్తి చేయడం తండ్రి ఆశయమంటూ తానే చేశానంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని, రింగ్‌రోడ్ మంథని ఎమ్మెల్యే పూర్తి చేసి ఉంటే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ చేశారు. అసలు సింగంపల్లి, నీలంపల్లి, సర్వాయిపేట, పెద్దంపేట వద్ద బ్రిడ్జిలు ఎప్పుడు పూర్తి అయినవో చెప్తవా అని ప్రశ్నించారు. తండ్రి ఆశయాలంటూ చెప్తున్న మంథని ఎమ్మెల్యే మీ తండ్రి సంకల్పం ఏంటో ఏమేమి చేశావో ఇంకా ఏం చేస్తావో సమాజానికి జవాబు చెప్పాలన్నారు. పూర్తయిన భవనాలు, రోడ్ల వద్దకు వచ్చి నేనే పూర్తి చేశానని ఎవరైనా చెప్తారా అని, మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అని ముద్దాడినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. మూడు ఓట్లు ఉన్న మన కుటుంబం గెలువాలంటే మోసం తప్ప ఏమీ లేదని మీ అయ్య చెప్పిండా అని ప్రశ్నించారు. మీ నాన్న మూడుసార్లు నీవు ఐదుసార్లు మోసం చేసి గెలిచారు కదా అని అన్నారు. రింగ్ రోడ్డు పూర్తి చేశామని చెప్పటానికి జ్ఞానం ఉండాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో ఆనాడు ఫారెస్ట్ మినిష్టర్‌గా ఉన్న జోగు రామన్న నేతృత్వంలో పారెస్ట్ క్లియరెన్స్ తీసుకువచ్చి 65కిలోమీటర్లు పూర్తి చేశామన్నారు. పంకెన మోదేడు సింగంలపల్లి రింగ్‌రోడ్డు పూర్తి చేసి 11బ్రిడ్జిలను కట్టించామన్నారు. అప్రోచ్ వాల్‌కు తట్టెడు మట్టి పోయని సన్నాసి బ్రిడ్జిలు, రింగ్‌రోడ్ కట్టామని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. ఈ విషయంలో కాంగ్రెసోళ్లకు సోయి ఉంటే ఆలోచన చేయాలన్నారు. తట్టెడు మట్టి పోయకుండా తమ్ముడికి దోచిపెడుతున్నాడని, తాను అందుబాటులో ఉండకపోతే తన జోకర్ తమ్ముడు చూసుకుంటాడని చెప్పాడని, మరి ఈనాడు జోకర్ తప్పుడు ఏం చేస్తున్నాడని అన్నారు. ఇసుక మట్టి మాఫియాతో దోచుకుంటున్నారే తప్ప ఈ ప్రాంత ప్రజల కష్టాలు కన్నీళ్లు పట్టించుకోవడం లేదన్నారు. 80శాతం పైబడి ఉన్న మా వర్గాలను మూడు ఓట్లు ఉన్న కుటుంబం మోసం చేసి పాలిస్తోందని అన్నారు. నిత్యం ముఖ్యమంత్రి పక్కనే ఉంటున్న మంథని ఎమ్మెల్యే కనీసం అభివృద్ధి పనులు చేయకుండా కాలాన్ని వృదా చేస్తున్నాడని, మమ్మల్ని తిట్టించుడు కేసులు పెట్టించుడు మానుకోవాలని ఆయన హితవు పలికారు. వర్షాకాలం వస్తుందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతరనే విషయాన్ని మంథని ఎమ్మెల్యే గమనించాలన్నారు. ఈ మట్టిలో పుట్టి కన్నీళ్లు కష్టాలు తెలుసు కనుకనే అధికారంలో ఉన్నప్పుడు అన్నీ పనులు చేశామని, ప్రతిపక్షంలో మీ మెడలు వచ్చి పని చేయించే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. తనపై ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని కేసులు పెట్టించి పోలీసులతో భయపెట్టించే ప్రయత్నం చేసినా పోరాటం ఆగదని ఆయన ఈ సందర్బంగా స్పష్టం చేశారు.





# మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్)

**రూ.20 వేల తక్షణ ఆర్థిక సాయం అందజేత**

**ప్రభుత్వ సహాయం అందిస్తామని హామీ**





**నల్గొండ ప్రతినిధి, జూన్ 6(ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలోని కలల్వాడలో ఇటీవల చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో దుర్మరణం పాలైన చంద్రమ్మ, లక్ష్మణ్, ప్రణీతల భౌతిక కాయాలకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) నివాళులర్పించారు. పూలమాలలు వేసి మృతులకు శ్రద్ధాంజలి ఘటించిన ఆయన, అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ వారికి భరోసా కల్పించారు. అనంతరం ప్రమాదంలో పూర్తిగా కాలిబూడిదైన ఇంటిని పరిశీలించి నష్టపరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా మృతుల అంత్యక్రియల నిమిత్తం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు పలువురు ప్రజలు పాల్గొన్నారు. “విషాదంలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తాం -- ప్రభుత్వం ద్వారా పూర్తి సహాయం అందేలా కృషి చేస్తాం” : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్

**- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్**
**- రూ.10 వేల లంచం స్వీకరిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఎస్‌కే మహమూద్ - మిర్యాలగూడలో ఏసీబీ మెరుపు దాడులు నివాసంలో సోదాలు కొనసాగింపు**





**నల్గొండ ప్రతినిధి, జూన్ 6(ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ ఎస్‌కే మహమూద్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు. సప్లమెంటరీ రిపోర్టును ఈఓ (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)కు పంపించేందుకు లంచం డిమాండ్ చేసిన ఆయన, బాధితుడి నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు ముందస్తు ప్రణాళికతో వల పన్నిన ఏసీబీ అధికారులు, మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో లంచం స్వీకరిస్తున్న సమయంలో మహమూద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు, మిర్యాలగూడలోని మందులవారి కాలనీలో ఉన్న ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆస్తులు, కీలక పత్రాలు మరియు ఇతర వివరాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపగా, పూర్తి వివరాలు అధికారిక ప్రకటన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# హోంగార్డు నాయిని రాజేందర్‌కు సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు



**కరీంనగర్ టౌన్, జూన్06(ది క్రైమ్ న్యూస్):** పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి, 35 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాయిని రాజేందర్ పదవీ విరమణ సందర్భంగా శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, రాజేందర్ ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, కమీషనరేట్ కేంద్రంలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించిన నాయిని రాజేందర్, తన 35 ఏళ్ల సర్వీసులో ఎంతో అంకితభావంతో, నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన రాజేందర్ శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో నాయిని రాజేందర్ కు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి, కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు






**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ మహిళలు, చిన్నారుల భద్రత విభాగం గత వారం రోజులుగా చేపట్టిన ప్రత్యేక చర్యలతో మహిళల భద్రతకు మరింత భరోసా కల్పించింది. మే 31 నుంచి జూన్ 6 వరకు మహిళల భద్రతా బృందాలు మొత్తం 118 ప్రలోభక తనిఖీ కార్యక్రమాలు నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న 31 మందిని ప్రత్యక్షంగా పట్టుకున్నాయి. వీరిలో 34 మందిపె స్వల్ప కేసులు నమోదు చేయగా, మరికొందరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే మహిళల నుంచి వివిధ మార్గాల ద్వారా అందిన 21 ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు చేపట్టారు. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఒక వ్యభిచార నిరోధక చట్టం కేసులో ఇద్దరు బాధితులను రక్షించి, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుంది. అదేవిధంగా మాదాపూర్ హైటెక్ సిటీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద భిక్షాటన చేస్తున్న ఐదేళ్ల బాలుడు ఉదయ్ కుమార్‌ను గుర్తించి రక్షించింది. అనంతరం బాలుడిని రంగారెడ్డి జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఎదుట హాజరుపరచి, శిశు విహార్ రక్షణ గృహంలో సంరక్షణ కోసం చేర్పించారు. కుటుంబ కలహాల పరిష్కారంలో భాగంగా కుటుంబ సలహా కేంద్రాలు, మహిళా సాధికారత కేంద్రాల ద్వారా 37 కుటుంబాలను తిరిగి కలిపేందుకు అధికారులు కృషి చేశారు. మరోవైపు అవగాహన కార్యక్రమాల ద్వారా 1,897 మందికి మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వేధింపులు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే వేధింపులు, సైబర్ మోసాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా జూన్ 6న పీరమ్‌చెరువులోని పీబీఈఎల్ సిటీలో మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ పోలీసు కమిషనర్ ఎస్. కృష్ణ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వై. హనుమాన్ గౌడ్, ఉప నిరీక్షకుడు శ్యామ్ సుందర్ పాల్గొని మహిళల భద్రతా బృందాలు, భరోసా కేంద్రాలు, మహిళా సాధికారత కేంద్రాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం అందిస్తున్న సేవల గురించి వివరించారు. అలాగే టీ-సేఫ్ మొబైల్ యాప్, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రశ్నోత్తరాలతో ముగిసిన ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ అందుబాటులో ఉంచిన సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.

# నేత్రదానం మరొకరికి వెలుగు నిచ్చే మహాదానం

● **లయన్స్ క్లబ్ సదాశయ ఫౌండేషన్ నాయకులు**



**రామగిరి, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):-** నేత్రదానం అనేది మానవతా దృక్పథానికి ప్రతీకగా నిలిచే గొప్ప దానమని కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సదాశయ ఫౌండేషన్ నాయకులు సాన రామకృష్ణ రెడ్డి, నల్లవెల్లి శంకర్ నూక రమేష్ అనంతరాములు, కాసర్ల మహేందర్ రెడ్డిలు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఎఫ్.సీ.ఐ రిటైర్డ్ ఎంప్లాయ్ కొండు రాజేశ్వర్ రావు దశదినకర్మలో వారు పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం సర్టిఫికెట్ ను అందించారు. మరణానంతరం కంటి కార్నియాలను దానం చేయడం ద్వారా దృష్టి లోపంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు తిరిగి చూపు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులతో ఈ విషయాన్ని చర్చించి నేత్రదానానికి ముందుకు రావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారన్నారు. నేత్రదానం చేయడానికి వయస్సు, లింగం, కంటి చూపు వంటి అంశాలు సాధారణంగా అడ్డంకి కావు. వ్యక్తి మరణించిన అనంతరం వీలైనంత త్వరగా సమీప నేత్ర బ్యాంకుకు సమాచారం అందిస్తే, వైద్య సిబ్బంది అవసరమైన ప్రక్రియను పూర్తి చేస్తారు. నేత్రదానం వల్ల మృతదేహానికి ఎటువంటి వికృత రూపం కలగదు. అంత్యక్రియలకు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. సమాజంలో ఇంకా నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించడం అత్యంత అవసరం. "మరణం తర్వాత కూడా మన కళ్ళు మరొకరి జీవితంలో వెలుగులు నింపగలవు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. నేత్రదానం ద్వారా దృష్టి కోల్పోయిన వారికి కొత్త ఆశను, కొత్త జీవితాన్ని అందించవచ్చు. ఈ సందర్భంగా ప్రజలందరూ నేత్రదాన ప్రతిజ్ఞ చేసి, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా ఈ మహోన్నత సేవలో భాగస్వాములను చేయాలని కోరుతున్నాము. "నేత్రదానం చేయండి -- ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపండన్నారు." ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, కరీంనగర్ కార్పొరేటర్ తాటి ప్రభావతి, తహసీల్దార్ బీరుకూరి దత్తు ప్రసాద్ రావు, కుటుంబ సభ్యులు కొండు రవీందర్ రావు, పల్లె అమర, తాటి ప్రభావతి, ఉనుగొండ.జయశ్రీ - శ్రీనివాస రావు,బాలసంకుల రాధ-రాజేందర్ రావు,కొండు వేణు పాల్గొన్నారు.

# వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేసిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

● **సీనియర్ సిటిజన్స్ చట్టం కింద ఇంటి స్వాధీనం కల్పించిన అధికారులు**



**నల్గొండ ప్రతినిధి, జూన్ 6(ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు ఇంజం చంద్రకళ, రమణారెడ్డి (70)లకు జిల్లా యంత్రాంగం న్యాయం చేసింది. తమ సొంత ఇంటిలో నివసించే హక్కు కోసం గత కొంతకాలంగా పోరాడుతున్న ఈ వృద్ధ దంపతులకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు అధికారులు ఇంటి స్వాధీనం కల్పించారు. వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లల విద్య, వివాహాలు సహా అన్ని బాధ్యతలను నిర్వర్తించిన అనంతరం, మిర్యాలగూడలోని తమ సొంత నివాసంలో ఉండే అవకాశం లేకుండా ఒక కుమారుడు గత ఐదేళ్లుగా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వారు ఫిర్యాదు చేశారు. అనారోగ్య సమస్యలు, పక్షవాతం, మోకాళ్ల శస్త్రచికిత్సలతో బాధపడుతున్న వృద్ధులు తమకు న్యాయం చేయాలని ఆర్డీవో ట్రిబ్యునల్, అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. సీనియర్ సిటిజన్స్ చట్టం--2007 ప్రకారం విచారణ జరిపిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, గత నెల 15న వృద్ధ దంపతులకు ఇంటి స్వాధీనం కల్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం స్థానిక ఆర్డీవో ఎస్. రమణారెడ్డి వివిధ శాఖల సమన్వయంతో ఉత్తర్వులను అమలు చేయాలని మే 23న ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డి, సీఐ నాగభూషణం, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ శాఖ, మహిళా-శిశు-వికలాంగుల ఒ వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి వృద్ధ దంపతులను వారి సొంత ఇంటిలోకి ప్రవేశపెట్టి స్వాధీనం కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ సిబ్బంది, సీడీపీఓ కార్యాలయం నుంచి రాములు, నాగిరెడ్డి, నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతకు స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్

● **ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులతో సైబరాబాద్ సీపీ ప్రత్యేక సమావేశం**





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థుల రవాణాను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారితంగా మార్చే లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు చేపట్టిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ శనివారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రవాణా శాఖ, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు, విద్యా సంస్థల రవాణా నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను తరలించే ప్రతి వాహనంలో సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ఆధారిత రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థలు, అత్యవసర భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే డ్రైవర్ల అర్హతలు, లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, నిర్వహణ ప్రమాణాలపై కఠిన పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ సంయుక్తంగా రూపొందించిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌పై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు, విద్యార్థులకు అందుబాటు ధరల్లో రవాణా సేవలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ యాప్ ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణిస్తున్న వాహనానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వాహనంలో విద్యార్థుల సంఖ్య, డ్రైవర్ వివరాలు, లైసెన్స్ స్థితి, వాహనం ఫిట్‌నెస్, ప్రయాణ మార్గం, ప్రస్తుత లొకేషన్ వంటి వివరాలు యాప్‌లో అందుబాటులో ఉండనున్నాయి. అదేవిధంగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా విద్యార్థుల రవాణా వాహనాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడంతో పాటు విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులు ట్రాఫిక్ నిర్వహణ, ఆర్టీఓ అనుమతులు, లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన సీపీ సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రారంభ దశలో కొన్ని సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయాలని సూచించిన సీపీ, సైబరాబాద్‌లో ఈ కార్యక్రమం విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశముందని తెలిపారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ శీతల్ సోహన్, మేడ్చల్ డీటీఓ శ్రీనివాస్, ఆర్టీసీ అధికారులు ప్రశాంత్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు

**కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలోనూ గొప్ప నిర్ణయం**





**రామగిరి, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):-** కుటుంబ పెద్దను కోల్పోయిన తీవ్ర విషాదంలోనూ, మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉన్నత భావంతో ఒక కుటుంబం నేత్రదానానికి ముందుకు వచ్చి మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన పొన్నం సారయ్య గౌడ్ (55) మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు తమ దుఃఖాన్ని పక్కనబెట్టి నేత్రదానానికి అంగీకరించారు. వారి ఈ గొప్ప నిర్ణయంతో సేకరించిన రెండు కార్నియాల ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు చూపు ప్రసాదించే అవకాశం లభించింది. ఈ విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి వెంటనే స్పందించి, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కేవీస్ వాసు, అలాగే ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్‌లను సంప్రదించి నేత్రాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ, నేత్రదానానికి అంగీకరించిన సారయ్య గౌడ్ భార్య శ్రీమతి సరోజన, కుమారులు అభిషేక్, కిషోర్, రాకేష్ మరియు కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి నిర్ణయం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జల్లారం గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సాగర్ రావు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు, కార్యక్రమాన్ని సమన్వయం చేసిన సదాశయ ఫౌండేషన్ సభ్యులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షులు లయన్ మేకల మారుతి యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగు నింపే మహాదానం నేత్రదానం. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలి అని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికకు ప్రజల మద్దతు

**- 40, 43వ వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు - పర్యావరణ పరిరక్షణపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపు**



**నల్గొండ ప్రతినిధి, జూన్ 6(ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల యాక్షన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక 40, 43వ వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే , మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ -- బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష -- నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటేష్, 43వ వార్డు కౌన్సిలర్ షబానా ఆయుబ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వార్డుల పరిధిలోని స్థానిక సమస్యలు, ప్రజల వినతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వార్డుల సర్వతోముఖ అభివృద్ధే లక్ష్యంగా 99 రోజుల ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వార్డుల్లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అక్కడికక్కడే మున్సిపల్ మరియు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, "పచ్చని – ప్రగతిశీల మిర్యాలగూడ" నిర్మాణం కోసం 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' వార్డు సభ



**కరీంనగర్ టౌన్, జూన్06(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీ నగర్ లోని కే.ఈ.ఎస్ గార్డెన్స్ లో "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" ప్రత్యేక వార్డుల సభ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నగర ప్రజల సమస్యల పరిష్కారం, డివిజన్ల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ఈ సభ సాగింది. ఈ ప్రత్యేక వార్డుల సభలో స్థానిక మున్సిపల్ కార్పొరేటర్లు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. లక్ష్మీ నగర్, పరిసర డివిజన్ల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మియాపూర్ ఫ్లైఓవర్‌కు సోమవారం శంకుస్థాపన

## ● సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.530 కోట్ల ప్రాజెక్టుకు శ్రీకారం

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలిచే మియాపూర్ చౌరస్తా, ఆల్విన్ కాలనీ చౌరస్తా ఫ్లైఓవర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం సహా పలు అభివృద్ధి పనులకు జూన్ 8న సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా శంకుస్థాపన వేదిక, సభా ప్రాంగణం ఏర్పాట్లను ఆరెకపూడి గాంధీ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, యువత, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గాంధీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రూ.530 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు 1.79 కిలోమీటర్ల పొడవైన ఆరు లేన్ల ద్విముఖ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే హాఫీజ్‌పేట్, మియాపూర్ మార్గంలో మూడు లేన్ల యూనీడైరెక్షనల్ అండర్‌పాస్, బాచుపల్లి, ఆల్విన్ చౌరస్తా మార్గంలో మరో మూడు లేన్ల అండర్‌పాస్ నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మియాపూర్, హాఫీజ్‌పేట్, చందానగర్, బాచుపల్లి ప్రాంతాల మధ్య ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు వాహనాల ఇంధన వినియోగం కూడా తగ్గుతుందని గాంధీ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని గాంధీ తెలిపారు. వాటిలో రూ.459 కోట్లతో గచ్చిబౌలి ఐటీ జంక్షన్ ఫ్లైఓవర్, రూ.220 కోట్లతో



ఖాజాగూడ జంక్షన్ ఫ్లైఓవర్, రూ.308 కోట్లతో లింగంపల్లి ఆర్ఓబీ ఫ్లైఓవర్, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ.100 కోట్లతో కొండాపూర్, చందానగర్ కోర్ అర్బన్ పాఠశాలల నిర్మాణాలు ముఖ్యమైనవని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని గాంధీ పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ఆధునిక మౌలిక వసతుల కల్పన, విద్యా, పట్టణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సిఎంసి ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు, హెచ్ఐసీటీఐ ప్రాజెక్టు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలను నిరసిస్తూ హామీ అమలు కై జూన్ 10న కలెక్టరేట్ ముట్టడి

## ● సిపిఐ నేత బాగం

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయంలో ఖమ్మం, వైరా, పాలేరు నియోజక వర్గాల సమావేశం శనివారం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ సంపన్నులు, కార్పొరేట్ల సేవలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలను పట్టించుకునే స్థితిలో లేదన్నారు. పదేళ్ల నాడు మోడీ అధికారాన్ని చేపట్టే ముందు రూ. 72 ఉన్న పెట్రోల్ ఇప్పుడు రూ. 115కు చేరుకుందని డీజిల్ సైతం రూ.55 నుంచి రూ. 108లకు చేరుకుందని ఆయన తెలిపారు. గ్యాస్ ధర రెండు రేట్లు పెరిగిందని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రాబడి పెరగలేదని హేమంతరావు తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా సామాన్యులను విస్మరించి పాలన సాగిస్తుందని యావత్ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలను ఇచ్చిందని ఆ హామీలు నెరవేర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు.

రెండున్నర ఏళ్లలో హామీల అమలులో వైఫల్యం చెందిన ప్రభుత్వం ఇకనైనా హామీల అమలుపై దృష్టిసారించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 నెల వారి జమ, కళ్యాణ లక్ష్మి క్రింద తులం బంగారం, కొత్త పింఛన్లు, పింఛన్ల పెంపు వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 24 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేశారని జూన్ రెండు నాటికి రెండు లక్షల పింఛన్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అది కూడా అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అరకొరగా ఇస్తున్న ప్రభుత్వం నివాస స్థలాల పంపిణీ గురించి మరిచిపోయిందన్నారు. స్థలాలు ఇస్తాం, ఇండ్లు ఇస్తామని చెప్పిన హామీని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తుందని




అందుకే సిపిఐ ఆందోళన బాట పట్టిందన్నారు. రైతు భరోసా కూడా సరిగ్గా అమలు జరగడం లేదని రెండు ఎకరాల రైతులకు మాత్రమే రైతు భరోసా జమ చేశారని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని హేమంతరావు ప్రశ్నించారు. మళ్లీ వానాకాలం సమీపిస్తుందని రైతు బంధు ఎప్పుడు జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేసినా రైతులకు నెలలు గడిచినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరే భూములను వేలం వేయడం ద్వారా మాత్రమే ఆదాయం సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తుందని హేమంతరావు ఆరోపించారు. ధరణిలోని లోపాలను భూభారతి సరి చేయలేదని భూ భారతి పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కుఅన్న చందంగా ఉందన్నారు. పింఛన్లను నాలుగు వేలకు పెంచాలని, అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని, హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ను ముట్టడించనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్ కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పార్శి బంధం బస్తీ ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలో వినతి పత్రం సమర్పణ

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం నగర పాలక సంస్థ 21వ డివిజన్ పరిధిలోని పార్శిబంధం బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలో సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. పార్శిబంధం బస్తీలోని 5 ఎలిమెంట్స్ అపార్ట్మెంట్ పక్కన ఉన్న రోడ్డులో కొన్ని నెలల క్రితం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా కల్పించకపోవడం, వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా అదే రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనివల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసభ అధికారులను కలిసి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి విద్యుత్ స్తంభాలకు వెంటనే విద్యుత్ సరఫరా కల్పించడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం మరియు డ్రైనేజీ నిర్మాణ పనులను అత్యవసరంగా చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వరప్రగడ రాఘవేంద్ర రావు పాల్గొన్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ ఖమ్మం 21వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి



పిల్లలమర్రి రజిత వెంకట్, బీజేపీ జిల్లా నాయకులు డి. కొండ శ్యామ్, స్థానిక నాయకులు రంగా రామారావు, కడారి శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల తరఫున సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని నాయకులు పేర్కొన్నారు.

# సింగరేణి పరిరక్షణ సదస్సుకు భారీగా తరలిరండి

## ● ఏ ఎల్ పి మైన్ వద్ద కార్మికులను చైతన్యపరచిన టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి





**రామగిరి, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి పరిరక్షణ కోసం కార్మికుల ప్రయోజనాలు హక్కుల సాధన ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో జూన్ 7 తేదీ ,ఆదివారం సాయంత్రం గోదావరిఖనిలో భారీ సదస్సును నిర్వహించనున్నట్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య పేర్కొన్నారు. శనివారం అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్. గని వద్ద కార్మికులను కలుసుకొని తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని సింగరేణి స్థితిగతులను, కంపెనీలో జరుగుతున్న అవకతవకలు, కుంభకోణాలను వివరించి కార్మికులను చైతన్యపరిచే సింగరేణి పరిరక్షణ సదస్సును నిర్వహించనున్నట్లు వివరించారు. ఇటీవల కాలంలో సింగరేణి కంపెనీ మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలను నిర్వహించి సింగరేణి కంపెనీ గడ్డు పరిస్థితిల్లో ఉందని పేర్కొన్న విషయాన్ని కార్మికులకు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండున్నర సంవత్సరాలలోనే సింగరేణిలో అనేక అవకతవకలు పెద్ద ఎత్తున అవినీతికి సంబంధించిన వ్యవహారాలు జరగడంతో కంపెనీ ప్రతిష్ట దిగజారుతున్నదన్నారు. ఎన్నికలకు ముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటియుసి, ఐఎన్టియుసి తమ పదవీకాలం పూర్తవుతున్న ఒక్క హామీని సైతం నెరవేర్చలేక కార్మికులను దగా చేశాయని వివరించారు. కెసిఆర్ కారుణ్య నియామకాల పేరుతో 15000 మందికి పైగా తండ్రి కొడుకుల ఉద్యోగాలను ఇవ్వగా వాటిలో సైతం విజిలెన్స్ కమిషన్ ద్వారా విచారణ చేస్తామని ప్రభుత్వ పెద్దలు పేర్కొనడం అత్యంత మార్గమని ఇది కార్మికులను భయపెట్టడమేనని విమర్శించారు. గైర్హాజరు కార్మికులను పూర్తి ఉద్యోగంలో నుండి తీసివేయడానికి యాజమాన్యం సిద్ధమవుతుందని టిఆర్ఎస్ పద్ధతిని సైతం అమలు చేసేందుకు ముందుకు సాగుతున్నదని ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులంతా సంఘటితంగా చైతన్య వంతం అవడం ద్వారానే మన అస్తిత్వాన్ని కాపాడుకోగలమని వివరించారు. కేవలం సింగరేణి సంస్థ లో జరుగుతున్న పరిణామాలు ఒకతవకలు కార్మికులకు జరుగుతున్న నష్టం కంపెనీ భవిష్యత్తు లాంటి అంశాలపై జరిగే అతి ముఖ్యమైన సదస్సుకు పెద్ద సంఖ్యలో కార్మిక సోదరులు విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంస్త్రలో ఫిట్ సెక్రటరీ వివి గౌడ్ ,సెంట్రల్ కమిటీ నాయకులు గట్టు శ్రీనివాస్ , వి.పాశం శ్రీనివాస్ రెడ్డి,ఓర్ మెన్ తేజ ,ఇతర పిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్‌లో మేకల మారుతి యాదవ్‌కు చోటు

**క్లబ్ సభ్యులందరి సేవా తపనకు, సమిష్టి కృషికి లభించిన గౌరవంగా భావిస్తున్నాను**

**జిల్లా గవర్నర్ లయన్. మోర భద్రేశం తో మేకల మారుతి యాదవ్**



**రామగిరి, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):-** కల్వచర్ల గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షులు లయన్ మేకల మారుతి యాదవ్ పదవి కాలం జూన్ 30న ముగుస్తుంది. అయితే వీరి నాయకత్వంలో క్లబ్ చేస్తున్న సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్‌లో స్థానం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ జిల్లా క్యాబినెట్‌లో నాకు అవకాశం రావడం వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులందరి సేవా తపనకు, సమిష్టి కృషికి లభించిన గౌరవంగా భావిస్తున్నాను. సమాజ సేవే లక్ష్యంగా మరింత అంకితభావంతో పనిచేస్తున్నామని తెలిపారు. లయన్స్ క్లబ్ 320+ జిల్లా (ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలు) పరిధిలోని 94 లయన్స్ క్లబ్‌లకు 2026-27 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా లయన్ మోర బద్రేశం, మొదటి ఉప గవర్నర్‌గా లయన్ గుటుక చంద్రప్రకాశ్, రెండవ ఉప గవర్నర్‌గా లయన్ ఉదరి చంద్రమోహన్ ఎన్నికయ్యారు. వీరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా క్యాబినెట్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి, క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్‌ను జిల్లా క్యాబినెట్ కి ఎంపిక చేశారు. జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 7వ తేదీన కరీంనగర్‌లోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తనను జిల్లా క్యాబినెట్‌కు ఎంపిక చేసిన జిల్లా గవర్నర్ మోర బద్రేశం, ఉప గవర్నర్లు గుటుక చంద్రప్రకాశ్, ఉదరి చంద్రమోహన్‌లకు, అలాగే సహకరించిన రీజినల్ చైర్మన్ శశాంక్, జోనల్ చైర్మన్ వెంకటేశ్వర్లుకి మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులందరికీ మేకల మారుతి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా క్యాబినెట్‌లో స్థానం దక్కిన మేకల మారుతి యాదవ్‌కు క్లబ్ సభ్యులు, లయన్స్ నాయకులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# కరీంనగర్‌లో ఘనంగా 'శ్రీ మహాదేవ ఫిష్ పాయింట్' ప్రారంభోత్సవం




**కరీంనగర్ టౌన్, జూన్ 06(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని సిరిసిల్ల బైపాస్ రోడ్, పెద్దమ్మ గుడి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ మహాదేవ ఫిష్ పాయింట్' దుకాణాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు అందుబాటులో నాణ్యమైన, తాజా చేపలను అందించేందుకు ఈ పాయింట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. వ్యాపార పరంగా నిర్వాహకులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, యాజమాన్యానికి తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫిష్ పాయింట్ అధినేత కిరణ్, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** శనివారం రాత్రి 2గంటలకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి బి గెస్ట్ హౌస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాంధీనగర్‌కు చెందిన జంగ సాకేత్ (17) మృతి చెందాడు. స్నేహితులతో బయటకు వెళు_న్నానని ఇంట్లో చెప్పి గంగానగర్ వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా గెస్ట్ హౌస్ వద్ద ఒక డిసిఎం వ్యాను ఎలాంటి ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై పెట్టడం వల్ల ఆ వాహనాన్ని చూసుకోకుండా వెనుక వైపు నుండి వెళ్లి మోటార్ సైకిల్‌తో ఢీకొట్టడంతో జంగ సాకేత్‌కు బలమైన రక్త గాయాలు అయి మృతి చెందాడు. మృతుని తండ్రిజంగ బిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని వన్‌టౌన్ సిఐఇంద్రసేనారెడ్డి తెలిపారు.

# ఆగిపోయిన పనులను పరిష్కరించాలి



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్‌ని కలిసి డివిజన్లోని ఆగిపోయి ఉన్నా పనులను సిసి రోడ్, స్ట్రీట్ లైట్స్ మరియు మొదలైన విషయాల గురించి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, శేఖర్, రాజేంద్ర గౌడ్, లాస్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9వ తారీఖున సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి సభ

- ప్రతి మండల సమాఖ్య కు బస్సు సాంక్షన్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేత
- రాష్ట్రవ్యాప్తంగా జూన్ 21న నీట్ పరీక్ష
- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





భూపాలపల్లి, జూన్ - 6:(ది క్రైమ్ న్యూస్): శనివారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు, ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ బందోబస్తు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు పరీక్షకు చేపట్టిన ఏర్పాట్లపై సమావేశంలో వివరించారు. పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత, విద్యుత్ సరఫరా, తాగునీరు, ఇతర సౌకర్యాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్ మాట్లాడుతూ పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, నిరంతర అప్రమత్తత పాటించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పుకార్లు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, పరీక్షల నిర్వహణపై ప్రభావం చూపే తప్పుడు సమాచారాన్ని వెంటనే గుర్తించేందుకు సామాజిక మాధ్యమాలను చురుకుగా పర్యవేక్షించాలని సూచించారు. జాతీయ పరీక్షా సంస్థ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ, ఈ ఏడాది పరీక్షల కోసం మరింత కట్టుదిట్టమైన భద్రతా విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా ప్రశ్నాపత్రాల రవాణా కోసం తొలిసారిగా భారత వైమానిక దళం సేవలను వినియోగిస్తున్నామని, పరీక్షల సమగ్రత, భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కార్యక్రమాలను సమీక్షించిన ప్రధాన కార్యదర్శి, రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల పాటు కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోత పూర్తయిన ధాన్యాన్ని కొనుగోలు తడవకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంకా ధాన్యం నిల్వ ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి, ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో చేపట్టనున్న పర్యటనల ఏర్పాట్లను కూడా ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బహిరంగ సమావేశాలు, భద్రత, రవాణా, వసతి, ఇతర లాజిస్టిక్ అవసరాలకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి అధికారులు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు గుర్రంపేట నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగే సభకు జిల్లా నుంచి మహిళా సంఘాల సభ్యులు ఆర్టీసీ బస్సుల్లో సకాలంలో చేరే విధంగా ఏర్పాట్లు చేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. సమయానికి ఆహారం, తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ప్రతి బస్సులో తప్పనిసరిగా తాగునీరు, అరటిపళ్లు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బస్సుల్లో ఏపీఎం, సీసీ, ఆశా, ఏఎన్ఎం, పోలీసులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు స్వయం సహాయక సంఘాల సభ్యులు పరేడ్ గ్రౌండ్ కు చేరేలా చూడాలని ఆదేశించారు. మహిళా సభ్యులు ప్రయాణ మార్గంలో జాగ్రత్తలు వహించాలని, ఇంటికి క్షేమంగా చేరుకోవాలన్నారు. రూట్ మ్యాప్ తప్పకుండా తయారు చేయాలని తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రత్యేక వార్డు సభలు

- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: చైర్మన్ చింతల చంద్రారెడ్డి





**నల్గొండ ప్రతినిధి, జూన్ 6(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో 6, 7, 8 వార్డులకు సంబంధించిన ప్రత్యేక వార్డు సభలను వీ.బి. నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పురపాలక సంఘం చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో భాగంగా హాలియా మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రధాన రహదారుల వెంట వ్యర్థాల తొలగింపు, ప్లాస్టిక్ నిర్మూలన వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులుగా జూట్, గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ-- 2026 నిబంధనలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి, శానిటరీ, స్పెషల్ కేర్ వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా వేరు చేయాలని సూచించారు. కొత్తగా ఇళ్లు నిర్మించేవారు వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం స్వచ్ఛ ప్లాస్టిక్ బ్యాన్ ప్రతిజ్ఞ చేయించి, ప్రత్యేక వార్డు సభల కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకోగా, వార్డు ప్రజల నుంచి పలు సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసురాజు, 8వ వార్డు కౌన్సిలర్ గౌహర్ జబీన్, 9వ వార్డు కౌన్సిలర్ చేరుపల్లి ముత్యాలు, మండల ఎంఈఓ, విద్యుత్ శాఖ ఏఈ, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజార్ మొయినుద్దీన్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, మహిళలు, లబ్ధిదారులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అడపాదడపా ఉపవాసం చేస్తున్నారా.? అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టే.. ఇదిగో క్లారిటీ..

ఇంటర్మీటెంట్ ఫాస్టింగ్(అడపాదడపా ఉపవాసం) వల్ల గుండె జబ్బులు వస్తాయని, స్ట్రోక్ వస్తుందని గత నాలుగైదు రోజులుగా ఎన్నో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మనం ఆహారాన్ని తీసుకున్న వెంటనే నోట్లో నుంచే జీర్ణక్రియ అనేది ప్రారంభమవుతుంది. లాలాజలంలో టయలిన్ అనే ఎన్జైమ్ ఉంటుంది. మన జీర్ణాశయంలో 4 గంటల పాటు ఉండి అక్కడ జీర్ణాశయంలో ఉండే హైడ్రోక్లోరిక్ యాసిడ్.. కాలేయం నుంచి వచ్చే కాలేయ రసాలు బైల్ యాసిడ్స్, క్లోమం నుంచి వచ్చే ఎన్జైమ్‌లు అన్ని కూడా ఈ ఆహారంతో కలుస్తాయి. ఈ ప్రాసెస్ అంతా జరగడానికి జీర్ణాశయం నుంచి మన ఆహారం బయటకు వెళ్లడానికి 6 గంటల సమయం పడుతుంది. జీర్ణాశయం నుంచి ఆహారం కిందకు వెళ్తేనే మరలా మనకు ఆకలి వేసినట్టు అనిపిస్తుంది. కానీ అక్కడే మనం పప్పులో కాలేస్తాం. అసలైన జీర్ణ వ్యవస్థ.. అసలైన ఆహారం జీర్ణం కావడం 6 గంటల తర్వాతే ప్రారంభమవుతుంది. దీనిని ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అని అంటారు. ఈ ఆహారం జీర్ణకోశం నుంచి కిందకు వెళ్లిన తర్వాత దాదాపు 3 మీటర్ల పొడుగున ఉండే చిన్న ప్రేగుల ద్వారా వెళ్తూ ఉంటుంది. అప్పుడు మన ఆహారంలో ఉన్న పదార్థాల్ని గ్లూకోజ్ గానూ ప్రోటీన్ లాగానే విభజించి వాటిని చిన్న ప్రేగులలో ఉన్న విల్లై ద్వారా అబ్సార్బ్ చేసుకొని అవి మరలా బ్లడ్‌లో కలిసి లివర్‌కు వెళ్లి కొంత స్టోర్ అయ్యి మనకు శక్తిని ప్రసాదిస్తాయి. తరువాత మిగిలిన వ్యర్థ పదార్థాలు పెద్ద ప్రేగులోకి వెళ్లి వీలైనంత నీటిని పీల్చుకొని విసర్జన జరుగుతుంది. ఇలా జీర్ణం కావడానికి మొత్తం 24 గంటల సమయం పడుతుంది. మన శరీరానికి కావలసిన శక్తిని ప్రసాదించేది ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అనే 16 గంటల సమయమే.. మనం చాలామంది జీర్ణకోశంలో ఆహారం ఉంటేనే మనకి శక్తి వస్తుంది అని అనుకుంటాం అది తప్పు. మరి ఈ మధ్య కాలంలో ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేస్తే హార్ట్ స్ట్రోక్స్ వస్తాయంటూ వైరల్‌గా మారింది. దీన్ని వైద్యులు కొట్టిపారేశారు. చైనాలో ఓ 200 మందికి ఫోన్ చేసి ప్రశ్నలడిగి, అవే ప్రశ్నలు అమెరికాలో ఉండే 200 మందికి అడిగి ఇక గుండె జబ్బులు వస్తాయి అంటున్నారని.. కానీ వాస్తవానికి దీనికి ఎటువంటి శాస్త్రీయమైన ఆధారాలు జతపరచలేదని.. ఇది ఒక బేసిక్ స్టడీ మాత్రమే కానీ దీనికి ఎటువంటి ప్రామాణికత లేదంటున్నారు. బాగా గమనించినట్లయితే చాలా జంతువులు, పక్షులు అన్నీ కూడా ఒక పూటనే తింటాయని.. మనుషుల మాదిరి చాలాసార్లు తినవంటున్నారు. తక్కువసార్లు తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు కొంచెం గ్యాప్ ఇవ్వడం వల్ల పేగులలో ఆహారం బాగా జీర్ణమయ్యి ఇంకా బాగా శరీరంలోకి అబ్సార్బ్ అవుతుంది అంటున్నారు. అందుకే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది నిజంగా ఫాస్టింగ్ కాదని మామూలుగా చేయాల్సిన పనే అంటున్నారు. అది కాకపోతే మనం ఎక్కువసార్లు తినడం అలవాటు చేసుకున్నాం. శరీర నిర్మాణంలో జీర్ణాశయం అనేది ఒక స్టోరేజ్ పాయింట్. పాత కాలంలో ఆహారం సదా దొరకదు. కాబట్టి మనకు జీర్ణాశయం అనేది పరిణామ క్రమంలో డెవలప్ అయింది. అనగా మనం ఆహారాన్ని ఒకేసారి తీసుకొని దానిని నిదానంగా కిందికి పంపిస్తూ జీర్ణం జరగడానికి అలవాటు పడిపోయాం. కానీ ఈ మారిన నవీన యుగంలో ఆహారాన్ని బయట స్టోరేజ్ చేసే పరిస్థితి వచ్చింది. కాబట్టి మనకు ఎప్పుడు పడితే అప్పుడు ఆహారం దొరుకుతుంది. అందుకని ఎక్కువసార్లు మనం తినాల్సిన అవసరం లేదంటున్నారు. మనం ఎంత తినాలి అని అనుకుంటే.. అంతా మనకు కావలసిన, మనకు నచ్చిన పదార్థం ఒక పూట తిన్నా గాని 24 గంటలకు సరిపోతుందని అంటున్నారు.

# రామగుండం కమిషనరేట్ లో డ్రగ్ కంట్రోల్ ప్రత్యేక బృందాల ఏర్పాటు

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం కమిషనరేట్ లో డ్రగ్ కంట్రోల్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ మత్తు పదార్థాల అక్రమ రవాణా మూలాలను గుర్తించేందుకు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని అన్ని సర్కిళ్లలో ప్రత్యేక బృందాలు అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, సమాజ అభివృద్ధికి ముప్పుగా మారుతున్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి విక్రయాలు లేదా రవాణా గురించి తెలిసిన వారు వెంటనే 8712656597 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను రహస్యంగా ఉంచుతామని, భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. యాంటీ నార్కోటిక్ బృందాలు ఇకపై మరింత పకడ్బందీగా పనిచేస్తాయని స్పష్టం చేశారు.

# గుట్టగా మారిన పొట్టకు ఛూమంత్రం.. సరిగ్గా ఆ సమయంలో తాగారంటే వెన్నలా కరగాల్సిందే..

యాపిల్ సైడర్ వెనిగర్‌లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మీరు దీన్ని నీటిలో కలిపి ప్రతిరోజూ తాగితే, బరువు తగ్గడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కొంచెం గోరు వెచ్చని నీటిలో ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, ఎప్పుడు తాగితే మంచిది అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: యాపిల్ వెనిగర్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా నుంచి శరీరాన్ని దూరంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. యాపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ గ్లైసెమిక్ ఎఫెక్ట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు దీనికి కారణం.. జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం: యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యల నుంచి కూడా ఉపశమనం అందిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది: ఆపిల్ సైడర్ వెనిగర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మేలు చేస్తుంది: యాపిల్ వెనిగర్ ఊబకాయాన్ని తగ్గించడంలో ప్రయోజనకరంగా పరిగణిస్తారు. హార్వర్డ్ హెల్త్ ప్రకారం, 2009లో 175 మందిపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 3 వారాల పాటు 1-2 టీస్పూన్ల వెనిగర్‌ను తీసుకునే వ్యక్తులు 2-4 పౌండ్ల బరువును తగ్గారని కనుగొన్నారు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల వేలు జరుగుతుంది.. 1-2 టీస్పూన్ల యాపిల్ వెనిగర్‌ను నీటిలో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగడం చాలా ప్రయోజనకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడొచ్చు!



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక అనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. రోజూ కుంకుమపువ్వు కలిపిన టీ లేదా పాలు తాగడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేసి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

# రైల్వే శాఖ షాకింగ్ నిర్ణయం..

## రూ. 30వేల కోట్ల వందేభారత్ రైళ్ల టెండర్ రద్దు..



దేశంలో ప్రముఖ రవాణా సాధనమైన రైల్వే ను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా నూతనంగా వందేభారత్ రైళ్లను నడుపుతోంది. వీటిని మరింత గా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా వంద వందే భారత్ రైళ్ల తయారీకి ఆల్‌స్టోమ్ ఇండియా కంపెనీతో గతంలో ఒప్పదం కుదుర్చుకుంది. కానీ ఈ 30 వేల కోట్ల టెండర్ ను ఇటీవల భారతీయ రైల్వే రద్దు చేసుకుంది. ఈ నిర్ణయం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఒక్కో రైలుకు రూ.150.9 కోట్ల బిడ్.. వందే భారత్ రైళ్ల కోసం 2023 మే 30వ తేదీన తెరిచిన టెండర్లలో ఆల్‌స్టోమ్ కంపెనీ అత్యల్ప బిడ్డర్ గా నిలిచింది. ఈ కంపెనీ ఒక్కో రైలు తయారీకి రూ.150.9 కోట్ల బిడ్ వేసింది. అయితే ఈ ధర ఎక్కువగా ఉందని రూ.140 కోట్లకు తగ్గించుకోవాలని రైల్వే కోరింది. కానీ రూ.145 కోట్లకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఆ కంపెనీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ధర ఎక్కువగా ఉండడంతో రైల్వే ఈ రూ. 30 వేల కోట్ల టెండర్ ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వంద వందే భారత్ అల్యూమినియం బాడీ రైళ్ల తయారీతో పాటు నిర్వహణ కోసం ఈ టెండర్ ను వేశారు. రద్దు విషయం నిజమే.. భారతీయ రైల్వే టెండర్ ను రద్దు చేసుకున్న విషయాన్ని ఆల్‌స్టోమ్ ఎండీ ఒలివియర్ లోయిసన్ ధ్రువీకరించారు. ఆర్డర్‌ను రద్దు చేసినప్పటికీ భవిష్యత్తులో అవసరమైతే మద్దతు ఇవ్వడానికి తమ కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఒక్కో రైలుకు ఈ కంపెనీ వేసిన రూ.150.9 కోట్ల ధర ఎక్కువగా ఉందని రైల్వే టెండర్ ప్యానెల్ గుర్తించింది. దాన్ని రూ. 140 కోట్లకు పరిమితం చేయాలని కోరింది. అయితే ఒక్కో రైలు సెట్‌కు రూ.145 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆల్ స్టోమ్ భావించింది. రైల్వే తెరిచిన రూ. 30వేల కోట్ల టెండర్‌కు వీరిదే అత్యల్ప బిడ్. మరో బిడ్ అయిన స్విస్ తయారీదారు స్టాడ్లర్ రైల్, హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్‌లతో కూడిన కన్సార్టియం ఒక్కో రైలు సెట్‌కు రూ. 170 కోట్ల బిడ్ వేసింది. గతంలో ఇలా.. గతంలో 200 వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్‌ల తయారీకి ఒక రేక్‌కు రూ. 120 చొప్పున గతంలో కాంట్రాక్ట్ మంజూరు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు. ప్రస్తుతం ఉన్న బిడ్ లో ఈ ధర ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి టెండర్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం కొన్ని నిబంధనలను సవరించనున్నారు. గతంలో మాదిరిగా కేవలం రెండు కంపెనీలే కాకుండా ఈసారి ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటారని సమాచారం. అర్హతలు.. టెండర్ కు వచ్చే కంపెనీలకు కొన్ని అర్హతలు ఉండాలి. అవి ఏడాదికి కనీసం ఐదు రైలుసెట్లను తయారు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. ఇందుకోసం వాటికి పరిశోధన మరియు అభివృద్ధి సౌకర్యం అవసరం. రైల్వే క్లాంట్రాక్ట్ ప్రకారం.. ఏడు సంవత్సరాలలోపు వంద రైలు సెట్టు డెలివరీ చేయాలి. గెలిచిన బిడ్డర్ డెలివరీ తర్వాత రూ.13 వేల కోట్లు అందుకుంటారు. ఆ తర్వాత 35 ఏళ్ల పాటు నిర్వహణ కోసం అదనపు రూ.17 వేల కోట్లు అందిస్తారు. హర్యానాలోని సోనేపట్ లో ఈ రైళ్లను తయారు చేయాలి.

# ఆ బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న వారికి షాక్!



మరింత భారం కానున్న ఈఎంఐ.. పూర్తి వివరాలు.. మన దేశంలో వివిధ రుణాలపై వడ్డీ రేట్లు పెరగనున్నాయి. బ్యాంకులు ఈ మేరకు తమ రేట్లను సవరించాయి. దేశంలోని ప్రముఖ బ్యాంకులు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాక్, కెనరా బ్యాంక్ వంటివి ఇప్పటికే తమ బ్యాంకుల్లో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్ఆర్)ను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఆగస్టు 12 నుంచి ఈ సవరించిన రేట్లు అమలులోకి వచ్చాయి. ఇప్పటికే ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)తో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఎంసీఎల్ఆర్ ను పెంచాయి. ఈ క్రమంలో రుణ గ్రహీతలపై భారం ఎలా ఉంటుంది? ఏ బ్యాంకు ఎంత మేర ఎంసీఎల్ఆర్‌ను పెంచింది? తెలుసుకుందాం రండి.. కారణం ఇదే.. ఆగస్టు 8న జరిగిన సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ నేపథ్యంలో రెపో రేటును 6.50 శాతం వద్ద కొనసాగించింది. దానిలో ఎటువంటి మార్పు చేయలేదు. దీంతో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) , కెనరా బ్యాంక్, యూకో బ్యాంక్లు ఎంసీఎల్ఆర్ ను పెంచుతున్నట్లు గత శుక్రవారం ప్రకటించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఆగస్టు 12 నుంచి అమలులోకి వచ్చేటటువంటి నిర్దిష్ట అవధులపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ పెంచాలని బీఓబీ నిర్ణయించింది. ఈ పెరుగుదల తర్వాత ఎంసీఎల్ఆర్ రేటు ఆరునెలలకు 8.75 శాతం, ఒక సంవత్సరానికి 8.95 శాతం ఉంటుంది. కెనరా బ్యాంక్.. ఈ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్ఆర్ ను ఆగస్టు 12 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచాలని నిర్ణయించింది. ఈ పెరుగుదల తరువాత.. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.80, ఒక సంవత్సరానికి 9 శాతం అవుతుంది. యూకో బ్యాంక్.. దీనిలో కొత్త రేట్లు ఆగస్టు 10 నుంచి అమలులోకి వచ్చాయి. నిర్దిష్ట కాలపరిమితిపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ ను పెంచాలని బ్యాంక్ నిర్ణయించింది. సవరించిన ఆరు నెలల, ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ వరుసగా 8.80 శాతం, 8.95 శాతంగా ఉంది. ఫ్లోటింగ్ రేట్ ఉన్న వారికి.. ఇప్పటికే రుణాలు కలిగి ఉన్న వారిపై ఈ చర్య కారణంగా ఈఎంఐ భారం పెరగనుంది. అయితే ఫిక్స్ డ్ వడ్డీ ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఫ్లోటింగ్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ పై లోన్ తీసుకున్న వారిపై ఈ భారం పడనుంది. ఈ బ్యాంకులు ఇప్పటికే.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత నెలలోనే ఎంసీఎల్ఆర్ రేటును 5–10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనిలో ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.85 శాతం వద్ద ఉన్నాయి. ఈ నెల ప్రారంభంలో, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.90 శాతంగా ఉంది. అలాగే బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ ని ఆగస్టు 1 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచి 8.95 శాతానికి పెంచింది. ఇండియన్ బ్యాంక్ తన ఓవర్‌నైట్ తో పాటు ఒక నెల ఎంసీఎల్ఆర్ ని ఒక్కొక్కటి 5 బేసిస్ పాయింట్లు పెంచి వరుసగా 8.20 శాతం, 8.45 శాతానికి పెంచింది. ఇవి ఆగస్ట్ 3 నుంచి అమలులోకి వచ్చాయి.

# నెలకు రూ. 1లక్ష పెన్షన్ కావాలా? ఇలా చేస్తే.. సాధ్యమే..



మన దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పెన్షన్ పథకాలలో నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) ఒకటి. దీనిలోని ఫీచర్లు, ప్రయోజనాలు అందరినీ ఆకర్షిస్తాయి. వాస్తవానికి ఇది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రారంభించిన పథకం. అయితే ఆ తర్వాత ఇది వేగంగా అప్ డేట్ అవుతూ విస్తరించింది. ఈ పథకాన్ని 2004లో ప్రవేశపెట్టారు. ఎస్పీఎస్ సాయిధ దళాల్లోని వారిని మినహాయించి, మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తర్వాత 2009 మేలో భారత పౌరులందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పథకంలో 18ఏళ్లు నిండి 70 ఏళ్ల మధ్య ఉన్న వారు ఎవరైనా పెట్టుబడులు పెట్టొచ్చు. భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకునేందుకు ఇది విలువైన ఎంపికగా పనిచేస్తుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) నియంత్రణలో ఈ ఎన్‌పీఎస్ పనిచేస్తుంది. ఇది మార్కెట్-లింక్డ్ డిఫైన్డ్ కాంట్రిబ్యూషన్ స్కీమ్. పదవీ విరమణ తర్వాత సాధారణ ఆదాయాన్ని అందించే కార్పస్ ను నిర్మిస్తుంది. ఇప్పుడు ఈ పథకంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రూ. లక్ష నెలవారీ పెన్షన్ పొందే అవకాశం కూడా ఉంది. అది సాధ్యమా అంటే.. అవుననే చెబుతున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో ఎన్‌పీఎస్ ద్వారా నెలకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే ఎంత పెట్టుబడి పెట్టాలి? ఎన్ని సంవత్సరాలు పెట్టాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. రూ. 1 లక్ష నెలవారీ పెన్షన్ రావాలంటే.. మీరు పదవీ విరమణ చేసిన తర్వాత మీ ఎన్‌పీఎస్ పెట్టుబడుల నుంచి నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందాలనుకుంటే కొన్ని అంశాలు ప్రాథమికంగా గుర్తుంచుకోవాలి. అవేంటంటే.. మీరు పెట్టుబడి ప్రారంభించే వయసు, ప్రతి ఏటా పెట్టుబడి పెంచుకుంటూ వెళ్లే ప్రణాళిక ఉండాలి. అప్పుడే మీకు అంది సాధ్యమవుతుంది. ఉదాహరణకు 35 ఏళ్ల వయస్సులో ఎన్‌పీఎస్ ప్రారంభించి, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందుతారు అనుకుందాం.. ఆ సమయానికి మీకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే.. మీ పెట్టుబడులు వార్షికంగా 10 శాతం పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడే మీ లక్ష్యాలను చేరుకోగలుగుతారు. మీరు 6 శాతం వార్షిక రాబడితో యాన్యుటీని కొనుగోలు చేయడానికి మీ మొత్తం కార్పస్లో 60 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 17,000 కంట్రిబ్యూషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో మీరు యాన్యుటీ కోసం మీ కార్పస్లో 40 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 34,000 విరాళంగా ఇవ్వాలి. ఈ రెండు రెండు సందర్భాల్లోనూ మీరు పదవీ విరమణ తర్వాత నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందుతారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ వల్ల ప్రయోజనాలు.. నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ప్రధానమైనది పన్ను ప్రయోజనాలు. అలాగే పదవీ విరమణ కోసం క్రమపద్ధతిలో ఆదా చేసే సామర్థ్యం. క్రమశిక్షణతో కూడిన పొదుపులను ప్రోత్సహించడం ద్వారా, ఇది వ్యక్తులు ఆర్థికంగా సురక్షితమైన పదవీ విరమణ కోసం ప్లాన్ చేయడంలో సహాయపడుతుంది.

# పదిన్నర నిమిషాల్లోనే 80శాతం చార్జింగ్.. టెస్లాను బీట్ చేసిన చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ..




విద్యుత్ శ్రేణి వాహనాల వల్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చార్జింగ్ సమయం. ఇదే చాలా మందిని వాటివైపు చూడకుండా చేస్తోంది. సాధారణ పెట్రోల్, డీజిల్ ఇంజిన్ కార్లు ఎక్కడైనా నిమిషాల్లో రీఫ్యూలింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రం కొన్ని గంటల సమయం రీచార్జ్ కోసం తీసుకుంటాయి. దీనివల్ల వాటిని ఎక్కువ దూరాలకు వినియోగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపైనే ఫోకస్ పెట్టిన ప్రధాన ఎలక్ట్రిక్ వాహన తయారీ దారులు పలు వినూత్న ఆవిష్కరణలను పరిచయం చేస్తున్నాయి. వీటిల్లో ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లాతో పాటు చైనాకు చెందిన బీవైడీ కూడా ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండింటినీ కూడా తలదన్నే రీతిలో ఓ కొత్త బ్యాటరీని ఆవిష్కరించింది చైనాకు చెందిన జీక్ర్ సంస్థ. తాము తీసుకొచ్చిన ఈ బ్యాటరీలు 10శాతం నుంచి 80శాతం చార్జింగ్ కావడానికి కేవలం పదిన్నర నిమిషాలే తీసుకుంటుందని వెల్లడించింది. ఇదే సమయంలో ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లాకు చెందిన లేటెస్ట్ ఇన్వెన్షన్ మోడల్-3లో వినియోగించే బ్యాటరీ ఇదే చార్జింగ్ చేయడానికి 15 నిమిషాలు పడుతుందని వివరించింది. ఈ బ్యాటరీ రేంజ్ 282 కిలోమీటర్లు ఉంటుందని పేర్కొంది. మైనస్ 10 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఈ బ్యాటరీలు మంచి పనితీరును అందిస్తాయని వివరించింది. దీనిని బట్టి తమ బ్యాటరీని ఎలాన్ మస్క్ టెస్లా కన్నా మెరుగైనదిగా కంపెనీ క్లయిమ్ చేసుకుందది. వచ్చే వారం కొత్త కారు.. చైనాకు చెందిన జీక్ర్ నుంచి కొత్త సెడాన్ వచ్చే వారం లాంచ్ కానుంది. 2025 జీక్ర్ 007 పేరుతో అందుబాటులోకి రానుంది. ఈ సెడాన్ లోనే జీక్ర్ రూపొందించిన అడ్వాన్స్ డ్ బ్యాటరీని అమర్చినట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా సినో ఆటో ఇన్ సైట్స్ డైరెక్టర్ టూ లీ మాట్లాడుతూ విద్యుత్ శ్రేణి వాహనాల మార్కెట్లో ఇక టెస్లా చార్జింగ్ టెక్నాలజీ బీట్ చేస్తూ కొత్త సాంకేతికతను జీక్ర్ రూపొందించిందన్నారు. జీక్ర్ క్లయిమ్ చేస్తున్న విషయాలు అద్భుతమనే చెప్పాలి. ఇది తప్పనిసరిగా ప్రపంచంలోనే వేగవంతమైన చార్జింగ్ టెక్నాలజీల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. జీక్ర్ సంస్థ ప్రస్థానం.. చైనా కార్ల తయారీలో దిగ్గజంగా పేరున్న గీలీకి చెందిన సంస్థే ఈ జీక్ర్ ఇంటెలిజెంట్ టెక్నాలజీ హోల్డింగ్ లిమిటెడ్, యూకేకు చెందిన లోటస్, స్వీడన్ కుచెందిన వోల్వో కూడా ఈ గ్రూపులోని సంస్థలే. దీనిని బట్టి జీక్ర్ రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ జీక్ర్ సంస్థకు చైనాలోనే 500 అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ సంఖ్యను ఏడాది చివరి నాటికి రెట్టింపు చేసే లక్ష్యంతో జీక్ర్ పనిచేస్తోంది. 2026 నాటికి చైనా మొత్తంలో 10,000 చార్జింగ్ స్టేషన్లు అందుబబాటులో ఉంచుకునేలా కార్యాచరణను రూపొందించింది.

# వ్యాపారం



## ఒక్క రూపాయి కట్టకుండానే రూ.7 లక్షల వరకు ఇన్సూరెన్స్ ..



భారతదేశంలోని ప్రతి ఉద్యోగికి ఉద్యోగుల భవిష్య నిధి పథకం కింద నెలవారీ జీతం నుండి కొంత మొత్తం తీసివేయబడుతుంది. నెలవారీ తగ్గింపులు ఉద్యోగి పీఎఫ్ ఖాతాకు జమ అవుతుంది. ఈ డబ్బును ఉద్యోగులు తమ అవసరాలకు వినియోగించుకోవచ్చు. బహుశా ఉద్యోగి తన పని జీవితమంతా పీఎఫ్ ఖాతా నుండి డబ్బు తీసుకోకపోతే అతను పదవీ విరమణ తర్వాత కూడా పెన్షన్ పొందవచ్చు. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో అత్యంత ముఖ్యమైన పథకం ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్. ఎంత బీమా కవరేజీ అందించబడింది. ఈ ప్లాన్ ప్రత్యేకతలు ఏమిటి? పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఈపీఎఫ్‌వో ఈడీఎల్ఐ బీమా పథకం ప్రత్యేకతలు: ఉద్యోగుల భవిష్య నిధి పథకంలో సభ్యులకు రూ.7 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. దీని ప్రకారం, ఈ పథకం కింద సభ్యులు బీమాను పొందేందుకు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రాథమిక వేతనం రూ.15,000 కంటే ఎక్కువ ఉన్న వారికి గరిష్ఠంగా రూ.6 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. గత 12 నెలల ఈపీఎఫ్ సభ్యుల సగటు నెలసరి జీతం కంటే బీమా మొత్తం 35 రెట్లు ఎక్కువ. అంటే గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు బీమా అందుతుంది. ఈ పథకంలో రూ.1,15,000గా ఉన్న బోనస్ మొత్తాన్ని గత ఏప్రిల్ నుంచి రూ.1,75,000కు పెంచడం గమనార్హం. బీమాను ఎలా క్లెయిమ్ చేయాలి? సభ్యుడు అకాల మరణం సంభవించినట్లయితే, అతని నామినీ లేదా చట్టపరమైన వారసుడు బీమా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. దీని ప్రకారం, సభ్యుని నామినీ వయస్సు తప్పనిసరిగా 18 సంవత్సరాలు. బహుశా నామినీ వయస్సు 18 కంటే తక్కువ ఉంటే, అతని తల్లిదండ్రులు డబ్బును క్లెయిమ్ చేయవచ్చు. ఈ మొత్తాన్ని పొందడానికి డెత్ సర్టిఫికేట్, వారసత్వ ధృవీకరణ పత్రం వంటి పత్రాలు తప్పనిసరి.

## విజయ్ సేల్స్ ఫ్రీడమ్ సేల్‌లో కళ్లుచెదిరే ఆఫర్లు.. ఆ ఫోన్లపై భారీ డిస్కౌంట్లు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చాలా కంపెనీలు ఫ్రీడమ్ సేల్స్ ద్వారా వినియోగదారులకు ప్రత్యేక తగ్గింపులను అందిస్తున్నాయి. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సైట్స్‌లో ఫ్రీడమ్ సేల్స్ ముగియగా ప్రస్తుతం ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో ఫ్రీడమ్ సేల్స్ ఊపందుకున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ విజయ్ సేల్స్ తన మెగా ఫ్రీడమ్ సేల్‌ను ప్రారంభించింది, ఆడియో పెరిఫెరల్స్, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లపై డిస్కౌంట్లను అందిస్తోంది. విజయ్ సేల్స్‌లో ఉన్న ప్రతి ఉత్పత్తిపై ప్రత్యేక తగ్గింపు అందిస్తామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్స్ ప్రత్యేక ఆఫర్లను విజయ్ సేల్స్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో విజయ్ సేల్స్ ఫ్రీడమ్ సేల్ గురించి వివరాలను తెలుసుకుందాం. సీఎంఎఫ్ ఫోన్ 1 లండన్ ఆధారిత ఫోన్ తయారీ సంస్థ నథింగ్ ఇటీవల సీఎంఎఫ్ ఫోన్ 1 పేరుతో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. మీడియా టెక్ డైమెన్సిటీ 2500 చిప్‌సెట్ ద్వారా పని చేసే ఈ ఫోన్‌పై ఫ్రీడమ్ సేల్ ప్రత్యేక తగ్గింపులను అందిస్తుంది. సీఎంఎఫ్ ఫోన్ 1 6.7-అంగుళాల 120 హెచ్‌జెడ్ ఎమోఎల్ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. ఆండ్రాయిడ్ 14 ఆధారంగా పనిచేసే ఈ ఫోన్ ప్రస్తుతం విజయ్ సేల్స్‌లో రూ. 15,999కి అందుబాటులో ఉంది. అయితే మీరు వన్ కార్డు ఈఎంఐ ద్వారా కొనుగోలు చేస్తే రూ. 1,000 తగ్గింపును పొందవచ్చు. అలాగే యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్ కార్డ్ హోల్డర్‌లు 5 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ ఆర్‌బీ కార్డ్ హోల్డర్‌లకు 7.5 శాతం తగ్గింపును కూడా అందిస్తుంది. వన్ ప్లస్ 12 ఆర్ ఈ ఫోన్‌ను 2024 జనవరిలో వన్ ప్లస్ ప్రారంభించింది. స్నాప్ డ్రాగ్ జెన్ 2 చిప్‌సెట్ ఆధారంగా పని చేసే ఈ ఫోన్ 6.78-అంగుళాల ఫుల్ హెచ్‌డీ ఎమోఎల్ఈడీ స్క్రీన్‌తో పని చేస్తుంది. ఈ ఫోన్ 8 జీబీ ం 256 జీబీ వేరియంట్‌ను రూ. 41,999కి కొనుగోలు చేయవచ్చు. అయితే ఐసీఐసీ కార్డ్ హోల్డర్లు ఈఎంఐ లావాదేవీలపై రూ. 2,000 తగ్గింపును పొందవచ్చు. విజయ్ సేల్స్ కూడా వన్ ప్లస్ ఈఎంఐ, హెచ్‌ఎస్‌బీసీ క్రెడిట్ కార్డ్ ఈఎంఐ లావాదేవీలపై 5 శాతం మరియు 7.5 శాతం తగ్గింపును అందిస్తోంది. ఐఫోన్15 ఫ్లిప్ కార్ట్ మాదిరిగానే విజయ్ సేల్స్ కూడా ఐఫోన్ 15ని తగ్గింపు ధరకు అందిస్తోంది. ఐఫోన్ 15 బేస్ వేరియంట్ 128 జీబీ ర్యామ్‌తో వచ్చే 6.1-అంగుళాల ఓఎల్ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. 48 ఎంపీ ప్రైమరీ కెమెరాతో వచ్చే ఈ ఫోన్‌ను ఐసీఐసీఐ బ్యాంక్, క్రెడిట్ కార్డ్‌తో కొనుగోలు చేస్తే రూ. 4,000 తగ్గింపు పొందవచ్చు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్, ఆర్‌బీఎల్ కార్డ్ వినియోగదారులు ఈఎంఐ లావాదేవీలపై 7.5 శాతం తగ్గింపును పొందవచ్చు. అలాగే వన్ కార్డు, యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఫెడరల్ కార్డ్ హోల్డర్‌లు 5 శాతం తగ్గింపును పొందవచ్చు.

# రోజూ ఈ జ్యూస్ తాగితే ఇన్ని లాభాలా..? ఇప్పటికైనా అలవాటు చేసుకోండి..!



జీర్ణ సమస్యలతో బాధపడేవారికి పైనాపిల్ జ్యూస్ చాలా మేలు చేస్తుంది. మీరు అతిసారం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా ఉబ్బరంతో బాధపడుతుంటే, పైనాపిల్ రసం మీకు సరైనది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండులో లభించే కాల్షియం, మెగ్నీషియం, ఇతర పోషకాలు పైనాపిల్స్‌లో తగినంత పరిమాణంలో కనిపిస్తాయి. ఇది ఎముకలు, దంతాలను బలపరుస్తుంది. పైనాపిల్ రసంలో పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.



ముఖ్యంగా మాంగనీస్, కాపర్, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, గాయం నయంకావటం, శక్తి ఉత్పత్తి చేయటానికి, కణజాల సంశ్లేషణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.ఇందులో ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, జింక్, కోలిన్, విటమిన్లు కె, బి కూడా ఉంటాయి. పైనాపిల్ యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి అద్భుతమైన మూలం. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. పైనాపిల్ రసంలో విటమిన్ ఎ లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పిల్లలకు పైనాపిల్ జ్యూస్ ఇవ్వడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అనేక రకాల క్యాన్సర్‌తో పోరాడవచ్చు.. బ్రోమెలైన్ జీర్ణక్రియ, గుండె ఆరోగ్యంతో పాటు అనేక రకాల క్యాన్సర్‌ల నుండి మిమ్మల్ని కాపాడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆస్తమా లక్షణాలను కూడా తగ్గించవచ్చు. పైనాపిల్ రసం ఉబ్బసంతో ఇబ్బంది పడేవారికి కూడా మేలు చేస్తుంది. పైనాపిల్ జ్యూస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని డ్యామేజ్ నుండి, ఇతర వ్యాధుల నుండి కాపాడుతుంది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్‌ల సమూహం కూడా ఉంటుంది. ఇది వాపును తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

# అవిసె గింజలతో ఆరోగ్యమే కాదు.. ఇలా వాడితే మెరిసే అందం మీ సొంతం!



మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అవిసె గింజల్లో ఉన్నాయి. కొలెస్ట్రాల్, డయాబెటిస్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు, ప్రతిరోజూ అవిసె గింజలతో చేసిన ఆహారాన్ని తినడం వల్ల వాటిని అదుపులో ఉంచుకోవచ్చు. మన శరీరానికి ఎంతో అత్యవసరమైన ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు అవిసె గింజల్లో ఉంటాయి. ఇవి పిల్లలకు, పెద్దలకు, గర్భిణులకు చాలా అవసరం. అవిసె గింజలతో చేసుకుంటే రోజుకో లడ్డును తినవచ్చు. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఫేస్ ప్యాక్: ఒక టీస్పూన్ అవిసె గింజలను కప్పు నీటిలో వేసి అరగంట పాటు నానబెట్టాలి. తర్వాత చిన్న మంటమీద నీరంతా జెల్‌గా మారేవరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత జెల్‌ను ముఖానికి పట్టించాలి. కాసేపటి తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. రోజుకు ఒకసారి ఈ ప్యాక్ వేసుకుంటే చర్మంపై ఉన్న వాపు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. రోజ్ వాటర్‌తో: అవిసెలను నీళ్లలో నానబెట్టి మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఆ పేస్టులో రోజ్ వాటర్ కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల అవిసె గింజల్లో ఉన్న పోషకాలు చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. స్క్రబ్ గా ఉపయోగపడుతుంది: చర్మంలో ఉండే మృత కణాలను తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచడానికి అవిసె గింజల పొడి మంచి స్క్రబ్‌గా ఉపయోగపడుతుంది. ఇందుకోసం ఒక కప్పులో అవిసె గింజల పొడి, ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే చర్మం తాజాగా మారుతుంది. జుట్టు ఆరోగ్యానికీ: ఒక టీస్పూన్ అవిసె గింజల పొడిని చిన్న గిన్నెలో వేసి, ఒక గుడ్డును కొట్టి ఆ పొడిలో వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి, జుట్టుకు రాసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు మెరుస్తుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.

# 30 ఏళ్లు వచ్చేసరికి.. పురుషుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు ఇవే!



సాధారణంగా వయసు పెరిగే కొద్దీ.. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఇవి చాలా కామన్ విషయం. కానీ ఇప్పుడున్న రోజుల్లో చిన్న పెద్దా అనే వయసుతో సంబంధం లేకుండా అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. వీటి పట్ల మొదట్లోనే జాగ్రత్తలు తీసుకోకపోతే.. చిన్న సమస్యలు కాస్తా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. అయితే ఆడవారి కంటే పురుషులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు. అస్సలు పట్టించుకోరు. అనారోగ్య సమస్యల లక్షణాలు కనిపించినా కేర్ చేయరు. ఆ తర్వాత ఆస్పత్రి పాలవ్వాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన సర్వేల ప్రకారం.. 30 ఏళ్లు దాటిన పురుషుల్లో కొన్ని రకాల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయట. వీటిని ప్రారంభంలో గుర్తించకపోతే.. చివరికి ప్రాణాల మీదకే వస్తుంది. ఇంతకీ పురుషులకు 30 ఏళ్లు దాటాక వచ్చే సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఎముకలు బలహీనం: 30 ఏళ్లు వచ్చిన తర్వాత పురుషుల్లో ఎముకలు బలహీనంగా మారతాయి. ఈ వయసులో ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే.. శరీరంలో విటమిన్ డి, క్యాల్షియం లోపం ఏర్పడుతుంది. దీంతో కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు రావచ్చు. కాబట్టి 30 ఏళ్ల వయసులో పురుషులు ఖచ్చితంగా క్యాల్షియం ఉండే ఆహారం తీసుకోవాలి. అలాగే వ్యాయామం కూడా చేయాలి. గుండె జబ్బులు: ప్రస్తుత కాలంలో ఉన్న ఆహారపు అలవాట్ల కారణంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అనేది విపరీతంగా పెరిగిపోతుంది. ఈ కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మీ లైఫ్ స్టైల్‌లో ఖచ్చితంగా మార్పులు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. బరువు పెరగడం: పురుషులకు 30 ఏళ్లు దాటాక.. బరువు అనేది పెరుగుతూ ఉంటారు. ఒత్తిడి, సరైన వేళకు సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల బరువు అనేది పెరిగిపోతారు. ఈ సమయంలో మీరు మీ శరీరంపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి. వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేయడం వల్ల ఒత్తిడి, బరువు తగ్గుతాయి. క్యాన్సర్: పురుషులకు 30 ఏళ్ల వయసులో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మూత్రంలో మంట, వృషణాల్లో నొప్పి, యూరిన్ సమస్యలు, ఇన్ ఫెక్షన్లు రావచ్చు. మీరు ఈ సమస్యలతో ఇబ్బంది పడితే టెస్టులు చేయించుకోవడం అవసరం.

# షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచే దివ్యాస్త్రాలు.. ఈ 5 జాగ్రత్తలు తప్పనిసరి!






డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఏడాది పొడవునా బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకోవడం సవాలుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా వేసవిలో షుగర్ లెవెల్స్‌ను తగ్గించుకోవడం అంత సులువు కాదు. అందుకే డయాబెటిక్ రోగులందరికీ వేసవి కష్టకాలంతో సమానం. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో మీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. వోక్‌హార్డ్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మీరా.. డయాబెటిక్ రోగులను వేసవి ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. సాధారణంగా అధిక వేడి వల్ల అలసట, డీహైడ్రేషన్ వంటి కారణాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం కష్టతరం అవుతుంది. అందుకే మధుమేహం ఉన్నవారు వేసవిలో మరింత జాగ్రత్తగా ఉంగాలి. ఎందుకంటే మధుమేహం ఉన్నవారు తమ శరీరంలోని నీటిని త్వరగా కోల్పోతారు. దీంతో సులభంగా నిర్జలీకరణానికి గురవుతారు. పైగా తక్కువ నీరు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీంతో రక్తనాళాలు, నరాల దెబ్బతినడం వంటి కొన్ని మధుమేహం సమస్యలు స్వేద గ్రంధులపై ప్రభావం చూపుతాయి. పైగా శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. ఇది హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్‌కు కారణమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. అందుకే వేసవిలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ కింది జాగ్రత్తలు తీసుకుంటే హాయిగా ఉండొచ్చు. ఔ వేసవిలో మధుమేహాన్ని నియంత్రించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు వీలైనంత హైడ్రేటెడ్‌గా ఉండాలి వేసవి కాలంలో అధిక వేడికారణంగా చెమట ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతారు. ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. నిర్జలీకరణం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తుంది. అందుకే ఈ కాలంలో నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు. కానీ చక్కెర కలిపిన తీపి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ కెఫిన్ వద్దు ఆల్కహాల్, కెఫిన్ ఆధారిత పానీయాలు నిర్జలీకరణానికి దారితీస్తాయి. ఎందుకంటే ఇవి అధిక మూత్రవిసర్జనకు కారణం అవుతాయి. ఈ పానీయాలు శరీరంలో నీటిని కోల్పోవడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తాయి. కాబట్టి అలాంటి డ్రింక్స్ తీసుకోవడం తగ్గించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి వేసవిలో రక్తంలో చక్కెర స్థాయిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. వేడి వాతావరణంలో హృదయ స్పందన రేటు పెరిగి, అధిక చెమటలు పట్టవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ కాలంలో ఇన్సులిన్ మోతాదును మార్చుకోవాలి. ఇన్సులిన్ మోతాదును మార్చాలనుకుంటే వైద్యుడిని సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. శారీరకంగా చురుకుగా ఉండాలి శారీరకంగా చురుకుగా ఉండటం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఈ కాలంలో యాక్టివ్‌గా ఉండటానికి ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయాలి. ఇలాంటి చిన్నపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలో హెచ్చుతగ్గులు వస్తాయి. అందుకే వ్యాయామాలు చేసే ముందు, పూర్తి చేసిన తర్వాత దాన్ని పరీక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లకపోవడం బెటర్ రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి వేసవి ఎండల నుంచి మిమ్మల్ని మీరు వీలైనంత ఎక్కువగా రక్షించుకోవాలి. వడదెబ్బ శరీరాన్ని ఒత్తిడికి గురి చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఒకవేళ తప్పనిసరైతే చర్మానికి సన్ స్క్రీన్ రాసుకోవడంతోపాటు వడదెబ్బను నివారించడానికి టోపీ, సన్ గ్లాసెస్, గొడుగుతో బయటకు వెళ్లాలి. అలాగే, శరీరంలోని బహిర్గత భాగాలను కవర్ చేసేలా చూసుకోవాలి.

# గుట్టలాంటి పొట్టకు ఛూమంత్రం..





గసగసాలులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మసాలా దినుసు గసగసాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని రాగి, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఫైబర్, మాంగనీస్ గొప్ప మూలంగా పరిగణిస్తారు. గసగసాలు అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సాయపడతాయి. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలోగసగసాలుఉపయోగపడతాయి.ఇంకాఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి కూడా ఉపశమనం కలిగిస్తాయి. గసగసాలు.. బరువు తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. పొట్ట, నడుము చుట్టూ కొవ్వు పెరగడం వల్ల మీరు ఇబ్బంది పడుతుంటే గసగసాలు తీసుకోవడం చాలా మంచిది.. ఎందుకంటే ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు బరువు తగ్గడానికి సహకరిస్తాయి. గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో గసగసాలు చేర్చుకుంటే.. కొన్ని రోజుల్లోనే మార్పు వస్తుంది. ఇంకా గసగసాల సిరప్‌ను మార్కెట్ నుంచి కొనుగోలు చేసి, దానిని షర్బత్‌గా చేసుకుని తాగవచ్చు.ఇదితీసుకోవడం వల్లఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తుంది. దీంతో బరువు క్రమంగా తగ్గుతుంది.గసగసాలు, పాలు కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వినియోగం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. ఒక గ్లాసు పాలలో 1టేబుల్ స్పూన్ గసగసాలు వేసిమరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగాలి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే ఏమవుతుందో తెలుసా..?



కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది. ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి. మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే అద్భుత ఫలితం ఉంటుంది. కొత్తిమీరలో గ్లైసెమిక్ 33 మాత్రమే ఉంది. ఇది చాలా తక్కువ. అటువంటి పరిస్థితిలో, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా చెప్పవచ్చు. పచ్చి కొత్తిమీర శరీరంలో చక్కెర స్థాయిని తగ్గించి, ఇన్సులిన్ మొత్తాన్ని పెంచుతుంది. అలాగే, రక్తంలో చక్కెర తక్కువగా ఉంటే కొత్తిమీర నీటిని తాగకూడదు. అది రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 9014159785, Mail:thecrimenews123@gmail.com